ప్రజాశక్తి
మంగళవారం 6 మే 2025 8 పేజీలు
ప్రకాశం బాపట్ల





దరఖాస్తుకు దారేదీ.?

- ఇప్పటికీ కొత్త దరఖాస్తు స్వీకరణకు అనుమతి శూన్యం
- పథకాల కోసం వృద్ధులు, వికలాంగుల ఎదురుచూపులు



పింఛన్ ఇప్పించాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి విన్నవిస్తున్న ఓ వికలాంగుడు (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

'అధికారంలోకి రాగానే ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలు ఇస్తాం.. పెన్షన్లు, ఇంటి స్థలాలు.. ఇళ్లు.. రేషన్‌కార్డులు..' ఏది కావాలన్నా ఇస్తామంటూ ఎన్నికల ముందు నేతలు చెప్పిన మాటలివీ.. ఇప్పుడు దరఖాస్తు స్వీకరించే పరిస్థితే లేదు. 11 నెలలుగా ఆన్‌లైన్‌లో లింకు ఇవ్వనందున ఏ పథకానికీ దరఖాస్తుపెట్టుకునే పరిస్థితి లేదు. ఎన్నికల ముందే రెండు నెలలు ఈ ప్రక్రియ ఆగిపోగా.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు గడిచింది. ఇంతవరకూ దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రభుత్వం సచివాలయాలకు అనుమతి ఇవ్వలేదు. దీంతో ఏడాదికి పైగానే పేదలు అర్హత కలిగి ఉన్నా ఏ పథకానికీ దరఖాస్తు చేసుకునే పరిస్థితి కూడా లేదు. ముఖ్యంగా ఏదో కారణంతో భర్తను కోల్పోయిన మహిళలకు వితంతు పెన్షన్లు రావడం లేదు. ఏడాదిగా వీరికి నష్టం జరిగినట్లే. 60 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులు పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నారు. రేషన్‌కార్డులకూ అనుమతి రాలేదు. ఇదిగోఅదిగో అంటూ మాటలు చెబుతున్నారు. ఇప్పుడు కొత్తగా వీటిని ఇస్తే ఆర్థిక భారం పడుతుందనే భయంతోనే దరఖాస్తులు కూడా స్వీకరించడం లేదు. గతంలో మాదిరిగా కాగితాలపై దరఖాస్తు దారుని వివరాలు నింపి అధికారులకు ఇచ్చే పరిస్థితి కాదు. అంతా ఆన్‌లైన్‌లోనే పెట్టారు. ఇంకెంతకాలమన్నదే ప్రశ్నార్థకంగా మారింది. ఇళ్ల స్థలాల కోసం చాలా మంది ఎదురుచూస్తున్నారు. మరో వైపు ఉన్న పథకాలకు లబ్ధిదారులను తగ్గించే యత్నం సాగుతోంది. ఈకేవైసీ పేరుతో మళ్లీ పేదలను పరుగులు తీయిస్తున్నారు. ఈకేవైసీ లేకుంటే వారికి పథకాలు నిలిపేయాలనే ఆలోచన ఉంది. ఇప్పటికే వికలాంగులు, 2లో

అటకెక్కిన 'పల్లె పండుగ' నిధులు

- జిల్లాలో రూ.110 కోట్లతో గ్రామాల్లో రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులు
- ఆరు నెలలుగా నిలిచిపోయిన బిల్లులు
- జిల్లాకు రావలసిన బిల్లులు రూ.58 కోట్లు



పల్లెపండుగ నిధులతో వేసిన సిమెంట్ రోడ్డు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పల్లె పండుగ నిధులు ఆరు నెలలుగా నిలిచిపోయాయి. జిల్లాలో ఇప్పటివరకు రూ.110 కోట్లతో గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు నిర్మించగా.. ఇంకా రూ.58 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది అక్టోబర్ 14వ నుంచి 20 వరకు పల్లె పండుగ – పంచాయతీ వారోత్సవాలు అట్టహాసంగా నిర్వహించారు. గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు చేపట్టారు. కేంద్రం నుంచి దండిగా నిధులు వస్తాయని, గ్రామాల్లో చేపట్టిన పనులకు వారం వారం బిల్లులు మంజూరు అవుతాయని గ్రామాల్లో రహదార్లు, డ్రైన్లు నిర్మాణాలు జరుపుకోమని చెప్పారు. పల్లె పండుగలో ఉపాధి హామీ నిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలకు వారు నివాసం ఉంటున్న గ్రామాలలో ఏడాదిలో కనీసం 100 రోజులు వేతన ఉపాధి కల్పించటం, జీవనోపాధి మెరుగుపరచటం ద్వారా ఉపాధి వేతనదారులకు కల్పించిన హక్కులను అమలు చేయడం ధ్యేయంగా పల్లెపండుగ కార్యక్రమం చేపట్టారు. దీని ద్వారా జిల్లాలో సిమెంట్ రోడ్లు, బీటీ రోడ్లు, ఉద్యాన పంటల సాగు, నీటి కుంటలు, గోకులాలు నిర్మించాలని, నీటి నిల్వకు ఉపయోగపడే ట్రెంచులను తవ్వాలని నిర్ణయించారు.

ఈ మేరకు జిల్లాలో ఉపాధి హామీ నిధులతో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో రూ.110 కోట్లతో 881 పనులను గ్రామ పంచాయతీల్లో చేపట్టారు. ఇందులో మొదటి విడతగా 656 పనులను, రెండో విడతలో 225 పనులను చేపట్టారు. దాదాపు అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద రహదారులు, సైడు కాలువ పనుల నిర్మాణాలు ప్రారంభించారు. ఈ పనులన్నీ కూడా ఎలాంటి టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిలో అప్పజెప్పారు. దీంతో సదరు పనుల్లో అత్యధిక శాతం ఆయా గ్రామాల్లో ఉన్న అధికార పార్టీ నేతలే చేపట్టారు. గత ఏడాది నవంబరు నెలలో ఈ పనులు ప్రారంభించగా డిసెంబరు మొదటి వారం వరకు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లుగానే ఎప్పటి బిల్లులు అప్పుడే మంజూరయ్యాయి. దీంతో గ్రామాల్లో కూడా వేగంగా రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. కానీ డిసెంబర్ రెండో వారం నుంచి బిల్లులు నిలిచిపోయాయి. ఇవాళ వస్తాయి, రేపు వస్తాయి.. అని అధికారులు చెప్పడంతో సదరు పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు, తెలుగు తమ్ముళ్లు అప్పులు తెచ్చి మరీ పనులు చేస్తూ.. వచ్చారు.

జిల్లాలో మొదటి విడతలో పర్చూరు నియోజకవర్గంలో రూ.23.86 కోట్లతో 186 పనులు చేపట్టారు.అద్దంకి నియోజకవర్గంలో రూ.19.10 కోట్లతో 191 పనులు,చీరాల నియోజకవర్గంలో రూ 4.10 కోట్లతో 79 పనులు, రేపల్లె నియోజకవర్గంలో రూ 9.70 కోట్లతో 70 పనులు, బాపట్ల నియోజకవర్గంలో రూ.7.54 కోట్లతో 66 పనులు, వేమూరు నియోజకవర్గంలో 2లో



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి దామోదర్

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

8లో



ఏఎన్ఎం ఆత్మహత్యపై సమగ్ర దర్యాప్తు చేయించాలని అర్జీ ఇస్తున్న నాయకులు, ఇతర ఏఎన్ఎంలు

ఉరేసుకొని ఏఎన్ఎం ఆత్మహత్య

పని ఒత్తిడే కారణమని సూసైడ్ నోట్

ప్రజాశక్తి - రేపల్లె

పని ఒత్తిడి కారణంగా ఓ ఏఎన్ఎం ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జరిగింది. సింగోటి కోటేశ్వరమ్మ(27) స్థానికంగా 5వ వార్డు సచివాలయంలో ఎఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ఈమె సోమవారం ఇంట్లోనే ఉరేసుకొని మృతిచెందారు. పని ఒత్తిడి కారణంగా చనిపోతున్నానని సూసైడ్ నోట్ రాసి చనిపోయారు. ఈ మేరకు తల్లిదండ్రులు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దర్యాప్తు చేయించాలి..

సింగోటి కోటేశ్వరమ్మ ఆత్మహత్య నేపథ్యంలో ఆమె మృతిపై సమగ్ర దర్యాప్తు చేయించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ విజయేంద్రరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.శ్యామ్ మాట్లాడుతూ ఈ కాలంలో వివిధ రకాల సర్వేలు, పని ఒత్తిడి, ఫోన్ యాప్స్‌లో సాంకేతిక కారణాలతో వచ్చే ఇబ్బందుల వల్ల హెల్త్ సెక్రటరీలకు సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనను పరిగణనలోకి తీసుకుని హెల్త్ సెక్రటరీలకు పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.మణిలాల్ మాట్లాడుతూ కోటేశ్వరమ్మ ఆత్మహత్యకు సంబంధించి సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ (సిఐటియు) యూనియన్, సచివాలయ హెల్త్ సెక్రటరీలు, సిఐటియు, వివిధ ప్రజా సంఘాల నాయకులు కె.ఆశీర్వాదం, కెవి లక్ష్మణరావు, డి అగస్టిన్ పాల్గొన్నారు.

అక్రమ కేసులు సహించం..

- రాష్ట్రంలో 'రెడ్‌బుక్ సిద్ధాంతం' నడుస్తోంది..
- కార్యకర్తలకు అండగా ఉంటాం
- ఈ నెలలో జగన్ పర్యటించే అవకాశం
- విలేకరుల సమావేశంలో వైసిపి నేతలు



మాట్లాడుతున్న జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రాష్ట్రంలో 'రెడ్‌బుక్ సిద్ధాంతం' నడుస్తోందని, పోలీసులు రెడ్‌బుక్ సిద్ధాంతం చెప్పినట్లు పాటిస్తూ.. వైసిపి కార్యకర్తలను వేధిస్తున్నట్లు వైసిపి నేతలు ఆరోపించారు. అక్రమ కేసులు పెట్టి, అకారణంగా కార్యకర్తలను హింసిస్తే సహించబోమన్నారు. సోమవారం నాడు వైసిపి జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నేతలు మాట్లాడారు. పోలీసులు ప్రజల పక్షాన శాంతి భద్రతలు పర్యవేక్షించాలే గానీ అధికార పార్టీ ఎమ్మెల్యేల మెప్పు కోసమో, ఇన్‌ఛార్జిల మెప్పు కోసమో తమ కార్యకర్తలను వేధించడం మానుకోవాలని హితవు పలికారు. వైసిపి ప్రకాశం జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ కరుమూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత తమ నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేసుకుని పోలీసులను అడ్డుపెట్టుకొని అక్రమ కేసులు బనాయిస్తూ వేధింపులకు పాల్పడుతోందన్నారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సూపర్ సిక్స్ హామీలతో 2లో

అక్రమ కేసులు సహించం..

(మొదటిపేజీ తరువాయి)

అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం కనీసం రైతు భరోసా కల్పించలేని దుస్థితిలో ఉందని విమర్శించారు. పొగాకు, మిర్చి, శనగ, వరి, అపరాలకు కనీస మద్దతు ధర ఇచ్చే పరిస్థితి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమాన్ని విస్మరించిందని, టిడిపి కార్యకర్తలే 70 శాతం అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. మంత్రి పదవి చేపట్టగానే హడావుడి చేసిన నాదెళ్ల మనోహర్ మద్దతు ధర విషయంలో రైతులకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.
వైసిపి ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకుని ప్రజల పక్షాన ఉద్యమించనున్నట్లు పేర్కొన్నారు. జులైలోపు గ్రామస్థాయి కమిటీలను నియమించి పార్టీ పటిష్టతకు కృషి చేస్తామన్నారు.

వైసిపి జిల్లా అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ దర్శి డిఎస్‌పి కార్యాలయం పక్కన ఓ చిరు వ్యాపారి రూ.2 లక్షల వ్యయంతో దుకాణం నిర్మాణం చేపడితే, నిర్మాణం పూర్తి అయిన తరువాత అక్రమమని ఒక సిఐ, నలుగురు ఎస్‌ఐలు 20 మంది పోలీస్ సిబ్బందితో నిర్ధాక్షిణ్యంగా దుకాణం తొలగించారని వివరించారు. ఈ ప్రక్రియను ప్రతినిత్యం గమనిస్తున్న డిఎస్‌పి ప్రేక్షక పాత్ర వహించారని ఆరోపించారు. ఈ విషయంపై ఎస్‌పికి ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు ప్రజల పక్షాన ఉండాలని, ప్రభుత్వ పక్షాన కాదని హితవు పలికారు. పోలీసుల వేధింపులకు తమ కార్యకర్తలు భయపడరని తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కాగా జిల్లాలో పంటల గిట్టుబాటు ధర గురించి తమ అధినేత జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించామని, ఈ నెలలో ఆయన జిల్లాలో చేపట్టే ఆందోళన కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, యర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవిబాబు, కనిగిరి నియోజకవర్గ సమన్వయకర్త దద్దాల నారాయణ పాల్గొన్నారు.

అటకెక్కిన 'పల్లె పండుగ' నిధులు

(మొదటిపేజీ తరువాయి)

రూ.11.11 కోట్లతో 64 పనులు చేపట్టారు. పల్లె పండుగ పనులు చేపట్టిన సమయంలోనే సదరు పనులను త్వరితంగా పూర్తి చేయాలని చెప్పడంతో బిల్లులు వస్తాయిలే అన్న ధీమాతో తమ తమ గ్రామాల్లో పనులు చేపట్టారు. కాని డిసెంబరు నుంచి నేటి వరకు ఒక్క బిల్లు కూడా మంజూరు అయిన పరిస్థితి లేదు. అద్దంకి నియోజకవర్గానికి రూ 13కోట్లు,చీరాల నియోజకవర్గానికి రూ 4 కోట్లు ,రేపల్లె నియోజకవర్గానికి రూ 8.50 కోట్లు,బాపట్ల నియోజక వర్గానికి రూ 6 కోట్లు, వేమూరు నియోజకవర్గానికి రూ 9 కోట్లు, పర్చూరు నియోజకవర్గానికి రూ 17.5 కోట్లు మొత్తంగా జిల్లాలో పల్లెపండుగ కార్యక్రమం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి రూ 58 కోట్ల బిల్లులు నిలచిపోయాయి. గత వైపిపి ప్రభుత్వంలో మాదిరిగా కూటమి ప్రభుత్వంలోనూ నెలల తరబడి బిల్లులు నిలచి పోవడంతో, జిల్లాలో పల్లెపండుగ పనులు కూడా అరకొరగా సాగుతున్నాయి. పనులు పూర్తి చేసిన వారు బిల్లులు ఎప్పుడు వస్తాయంటూ ఎదురుచూస్తున్నారు.కొన్ని గ్రామాల్లో సగం సగం పనులు చేసి నిలిపివేసిన పరిస్థితి ఉంది.

'దరఖాస్తు'కు దారేదీ.?

(మొదటిపేజీ తరువాయి)

వివిధ రోగుల పెన్షన్లపై విచారణ జరిగింది. వీటితోపాటు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కోసం కూడా పేదలు ఎదురుచూస్తున్నారు. పట్టణాల్లో రెండు సెంట్లు. పల్లెల్లో మూడు సెంట్లు ఇస్తామన్న వాగ్దానం ఎక్కడా ఇంతవరకూ అమలు కాలేదు. ఒంగోలులో ఎన్నికలకు ముందు ఇచ్చిన పట్టాల పరిస్థితి ఏమిటన్నదీ సందిగ్ధంగానే మారింది. వచ్చే నెలలో పాలన మొదటి సంవత్సరం పూర్తవుతుంది. ఇంతవరకూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు పూర్తి కాలేదు. ఒకటి తప్ప ఏదీ అమలు కాలేదు. అర్హత ఉండి కూడా వేలాది మంది పేదలు పథకాల కోసం నోచుకోలేకపోతున్నారు. ఈ అంశాన్ని ఎమ్మెల్యేలు కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాల్సిన అవసరం ఉంది.

తాగునీటి సమస్యపై తక్షణమే స్పందిస్తాం..

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

వేసవిలో తాగునీటి కోసం ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన పనిలేదని, తాగునీటి సమస్య ఎక్కడ ఉందో తెలిసిన వెంటనే స్పందిస్తామని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 32వ వార్డు ప్రజల తాగునీటి అవసరాల కోసం బోరు నిర్మాణానికి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమర మాట్లాడుతూ ఇక్కడ నీటి సమస్య ఉన్నట్లు తన దృష్టికి తీసుకువచ్చిన కొద్ది రోజుల్లోనే బోరు నిర్మాణం చేపట్టామన్నారు. వేసవిలో ఏ ప్రాంతంలోనూ నీటి కష్టాలు లేకుండా చూస్తామని చెప్పారు. అనంతరం ఆ వార్డులో రహదారులు, మురుగు కాలువల సమస్యలు ఉన్నట్లు ప్రజలు ఎమ్మెల్యే కందులకు వివరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డివిఎస్. నారాయణరావు, కౌన్సిలర్ షేక్ చిన్నషెక్షావలి, ఎఎంసి ఛైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బోరుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కందుల

తప్పిపోయిన బాలుడు

నిమిషాల్లోనే తల్లిదండ్రుల వద్దకు చేర్చిన పోలీసులు

ప్రజాశక్తి-మార్కాపురం

తప్పిపోయిన బాలుడిని కేవలం నిమిషాల వ్యవధిలోనే తల్లిదండ్రుల వద్దకు చేర్చి ప్రశంసలు పొందారు మార్కాపురం పట్టణ పోలీసులు. అందిన వివరాల ప్రకారం.. పెద్దారవీడు మండలం గుండంచెర్ల గ్రామానికి చెంది గోరంట్ల రాజేశ్వరరెడ్డి పనిమీద మార్కాపురం వచ్చింది. తన పాటు ఆరేళ్ల కుమారుడు శివరామక్రిష్ణారెడ్డిని కూడా తీసుకొచ్చాడు. స్థానిక వినోద్ హాస్పటల్ సమీపంలో బాలుడు తప్పిపోయాడు. దీంతో తండ్రి రాజేశ్వరరెడ్డి ఖంగారు పడ్డారు. సోషల్ మీడియా ద్వారా బాలుడు తప్పిపోయిన విషయం పోలీసులకు తెలిసింది. పట్టణ ఎస్ఐ ఎం.సైదుబాబు స్పందించారు. సిబ్బందితో పట్టణంలో గాలింపు చేపట్టారు. కేవలం పది నిమిషాల వ్యవధిలో బాలుడిని గుర్తించారు. తండ్రి రాజేశ్వరరెడ్డికి బాలుడిని అప్పగించారు. పోలీసుల స్పందించిన తీరును ప్రజలు కొనియాడారు.



తల్లిదండ్రులకు బాలుడిని అప్పగిస్తున్న పోలీసులు

మస్టర్ కోసం ఉపాధి కూలీల అవస్థలు

ప్రజాశక్తి - రాచర్ల

అసలే ఎండా కాలం. ఓ ప్రక్క భానుడు తన ప్రతాన్ని చూపుతున్నాడు. మరో ప్రక్క ఉపాధి కూలీలు హాజరు వేయించుకొనేందుకు అవస్థలు పడుతున్నారు. వెబ్‌సైట్లు సరిగా పనిచేయక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. హాజరు వేయించుకొనేందుకు ఎండల్లోనే వేసి ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాచర్ల మండలం పాలకవీడు పంచాయతీకి చెందిన కూలీలు ఉపాధి హామీ పనుల కోసం దాదాపు 10 కిలోమీటర్లు మేర వెళ్లి పనులు చేస్తున్నారు. అనుమలవీడు గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు సోమవారం పని ప్రదేశంలో హాజరు వేసేందుకు, ఫొటో వివరాలు అప్‌లోడ్ చేయటానికి సైట్ పనిచేయక పోవడంతో మధ్యాహ్నం 12 గంటల వరకూ ఎండలో త్రీవ ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి ఉపాధి కూలీల హాజరు, పనుల నిర్వహణలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని కూలీలు వేడుకొంటున్నారు.



మస్టర్ హాజరు కోసం ఎండలో వేచి ఉన్న కూలీలు

గ్రంథాలయంలో పుస్తక పఠనం

ప్రజాశక్తి - గిద్దలూరు

వేసవి శిక్షణా తరగతులు భాగంగా గిద్దలూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థుల చేత దేశభక్తి గేయాలు, నీతి కథల పుస్తకాలను పఠనం చేయించారు. అనంతరం క్యారమ్స్, చెస్‌లో శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయుడు జెఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ద్వారా మెదడుకు పదును పెట్టొచ్చని తెలి పారు. అనంతరం సహకారంతో విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం : వేసవి సెలవుల్లో విద్యార్థులు సజనాత్మకంగా, ప్రయోజన కరంగా గడపాలన్న లక్ష్యంతో శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక గ్రంథపాలకురాలు కటికల ఝాన్సీ తెలిపారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు సరికొత్త విషయాలను నేర్చుకోవడంలో ఆసక్తి చూపాలన్నారు. చిత్రలేఖనమలాంటి కళలు భావ వ్యక్తీకరణకు మాధ్యమంగా నిలుస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు రేఖాచిత్రాలు, రంగులతో కళాత్మకంగా వేసి తమ ప్రతిభను చాటారు. శిక్షణా కార్యక్రమంలో పేపర్ ఆర్ట్, ఫ్రీహ్యాండ్ డ్రాయింగ్, రంగుల ఉపయోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

డ్రాయింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా పెద్దదోర్నాల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు డాయింగ్‌పై శిక్షణ ఇచ్చారు. అనంతరం చెస్ ఆడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు డి వెంకట సుబ్బారెడ్డి, డాయింగ్ ఫ్యాకల్టీ బి.ఆదిలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు శుభాకాంక్షలు చెబుతున్న వీఆర్‌ఎలు

తహశీల్దార్‌కు వీఆర్‌ఏల శుభాకాంక్షలు

ప్రజాశక్తి-మద్దిపాడు

తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన నారాయణరెడ్డికి వీఆర్‌ఏలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తహశీల్దార్‌ను కలిసిన వారిలో వీఆర్‌ఏ ఐక్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదల రాజు, వీఆర్‌ఏలు కావూరి రాగోలు, పూనూరు నరసయ్య, ఉన్నం సావిత్రి, అనీలు, తోట పూర్ణచంద్రరావు, అనంతశక్తి, వెంకటేశ్వర్లు, కుమ్మరి ఇశ్రాయేలు తదితరులు తహశీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

కనిగిరిలో కార్డెన్ సెర్చ్

30 బైకులు, రెండు ఆటోలు సీజ్



తనిఖీలు నిర్వహిస్తున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని బీసీ కాలనీ, మంగళమాన్యం, దొరువు బజార్, కాశిరెడ్డి కాలనీ వివిధ ప్రాంతాలలో ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్పి పి.సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం కార్డెన్ సెర్చ్‌ను పోలీసులు నిర్వహించారు. చెడు నడత, పాత నేర చరిత్ర కలిగిన వ్యక్తులు ఉండేటువంటి ఏరియాలను, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తున్న పలువురి గృహాలను సెర్చ్ చేశారు. సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలను మరియు రెండు ఆటోలను స్వాధీనం చేసుకొని స్థానిక కనిగిరి పోలీస్ స్టేషన్‌కు తగు చర్య నిమిత్తం తరలించారు. వాహనాల తాలుకు పత్రాలను పరిశీలించి ఎంవిఐ యాక్ట్ ప్రకారం చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమవేశంలో డీఎస్పీ పి.సాయి ఈశ్వర్ యశ్వంత్ మాట్లాడుతూ పిల్లల, యువత యొక్క ప్రతి రోజు కార్యకలాపాలు గమనిస్తూ ఉండాలన్నారు. వారు ఎక్కడకు వెళ్తున్నారు, ఏమి చేస్తున్నారు అని తెలుసుకోవలసిన బాధ్యత తల్లితండ్రుల మీద ఉందన్నారు. గంజాయి యువతపై ఎక్కవ ప్రభావం చూపుతుందని, గంజాయి విక్రయాల గురించి ఎవరైనా సమాచారం అందిస్తే తక్షణమే అందుకు కారణమైన వారిపైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సమాచారం అందించిన వారి వివరములు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సెర్చ్‌లో కనిగిరి సీఐ షేక్ ఖాజావలి, కనిగిరి టి.శ్రీరామ్, హెచ్‌ఎంపాడు ఎస్సై కె.మాధవరావు, పిసి పల్లి ఎస్సై జి.కోటయ్య, వెలిగండ్ల ఎస్సై కృష్ణ పావని, కనిగిరి సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధరాత్రి కారుతో బీభత్సం

మద్యం మత్తులో యువకుల హల్‌చల్

ఇళ్లపైకి రావడంతో స్థానికుల భయాందోళన



దెబ్బతిన్న కారు

ప్రజాశక్తి-చీరాల

కొత్తపేట సంపత్ నగర్ కాలనీ మూడు రోడ్డుల సెంటర్లో మందుబాబులు ఆదివారం అర్ధరాత్రి బీభత్సం సృష్టించారు. ఫూటుగా మద్యం సేవించి కారులో ప్రయాణిస్తూ వాహనాన్ని అదుపు చేయలేక ఇళ్లపైకి దూసుకెళ్లారు. దీంతో అక్కడే నివాసం ఉంటున్న ఓ న్యాయవాది ఇంటి ప్రహరీ గోడను కారు ఢీకొట్టి మరో ఇంటి గోడ మీదకు దూసుకెళ్లింది. ఈ సంఘటనలో కారు ధ్వంసమయింది. మందుబాబులు భయంతో కారు వదిలిపెట్టి అక్కడ నుంచి పరారయ్యారు. ఈ కారు నెంబరు ఆధారంగా తెలంగాణ రాష్ట్రానికి చెందినదిగా స్థానికులు భావిస్తున్నారు. ఈ సంఘటనతో భయభ్రాంతులకు గురైన స్థానికులు వెంటనే రెండవ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ కారు ఎవరిది? అందులో ప్రయాణిస్తున్న వ్యక్తులు ఎవరు? అనే అంశాల దిశగా టూటౌన్ సిఐ నాగ భూషణం విచారణ చేస్తున్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు : సిఐ

ప్రజాశక్తి - గిద్దలూరు

మద్యం తాగి వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురికావద్దని, రోడ్డు ప్రమాదాల కారణంగా మతి చెందితే వారి కుటుంబం రోడ్డున పడుతుందని సిఐ సురేష్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తూ ప్రజలలో అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పట్టణంలోని వైఎస్‌ఆర్ సెంటర్‌లో సోమవారం సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపుట నేరమన్నారు. ప్రమాదాలు జరిగితే కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఇమ్మాన్యుయేల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి-పీసీపల్లి

జనసేన సెంట్రల్ ఆంధ్ర కమిటీ సభ్యులు మాదాసు రమేష్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో మరియు పెద ఇర్లపాడు లో రెండు చోట్ల వీటిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తాసిల్దార్ సి హెచ్ ఉష, ఎంపీడీవో ఓ ప్రభాకర్ శర్మ ,ఎస్సై జి కోటయ్య ,డిప్యూటీ ఎంపీడీవో ఎస్ రాంప్రసాద్, టిడిపి మండల అధ్యక్షుడు రామయ్య, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రైల్వే పనులు వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి



రైల్వే లైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అధికారులను ఆదేశించారు. కనిగిరి సమీపంలో నిర్మాణంలో ఉన్న రైల్వే స్టేషన్‌ను ఆయన సందర్శించారు. రాబోయే ఆగష్టు నెలలో రైల్వే లైన్ ప్రారంభం కావాల్సిన దృష్ట్యా అన్ని పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. కనిగిరి నియోజకవర్గంలో యడవల్లి, గార్లపేట, కనిగిరి రైల్వే స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు వాటి నిర్మాణం తుది దశకు చేరినట్లు అధికారులు ఎమ్మెల్యేకి తెలిపారు. ఓవర్ బ్రిడ్జి, కవర్ ఓవర్ ప్లాట్‌ఫారాలు, ప్యాసింజర్ వెయిటింగ్ హాల్స్ పనుల పురోగతిని ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. మహిళల కోసం ప్రత్యేక వెయిటింగ్ గదులు, ఏసీ ప్రయాణికుల కోసం వసతి గదులు, జనరల్ క్లాస్ ప్రయాణికులకు మరింత అనుకూలంగా ఉండే వసతులు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంత్రి నారా లోకేష్ ఇటీవల కనిగిరిలో బయో గ్యాస్ ప్లాంట్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆగష్టులో రైల్వే లైన్ ప్రారంభమవుతుందని ప్రకటించిన విషయాన్ని ఎమ్మెల్యే పునరుద్ఘాటించారు. రైల్వే లైన్ ప్రారంభం వల్ల కనిగిరి నియోజకవర్గం ఆర్థికాభివృద్ధికి కీలక అడుగు వేయబడుతుందన్నారు. ప్రజలకు ప్రయాణ సౌకర్యం పెరగడమే కాదు, వాణిజ్య అభివృద్ధికీ ఇది దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, కాంట్రాక్టర్లు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కొండపి

పిడుగుపాటుకు గురికాకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తహశీల్దార్ మురళి, ఎంపీడీవో రామాంజనేయులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకాశం జిల్లా కొండపి మండల పరిధిలో రాబోవు మూడు రోజులలో ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగులు పడే అవకాశం ఉందని ప్రకటనలో తెలిపింది. కావున మండల ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ మురళి, ఎంపీడీవో రామాంజనేయులు తెలిపారు. ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలని అలాగే క్షేత్ర స్థాయిలో గ్రామ రెవిన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు వారి గ్రామాలలో అవగాహన కల్పించాలని వారు అదేశించారు. గ్రామంలో ఎవరైనా పిడుగుపాటుకు గురైతే ప్రాణ, ఆస్తి నష్టం జరిగితే ఈ దిగువ పేర్కొన్న నెంబర్లకు తెలియజేయవలసిందిగా వారు కోరారు. ఎంపీడీవో రామాంజనేయులు 7093009682, తహసీల్దార్ మురళి 9281034446లకు ఫోన్‌చేసి తెలియజేయాలన్నారు.

సిఎస్‌పురం రూరల్: ఉరుములు మెరుపులు పిడుగులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఎల్.బ్రహ్మాయ్య, డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వర్లులు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచనల మేరకు రానున్న 3 రోజులు అనేకచోట్ల పిడుగులు పడే అవకాశం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ ఏ తమిమ్ అన్సారీయా అదేశాల మేరకు పిడుగులపై అప్రమత్తంగా ఉండాల్సిన అంశాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించనునట్లు తెలిపారు. ఆ మేరకు పిడుగులు పడే అవకాశం ఉన్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి సచివాలయంలో ఫ్లెక్సీలు వేయించి, ప్రజలలో అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అందుబాటులో ఉన్న చర్చిలు, దేవాలయాలు మరియు మసీదులపై మైకులను ఉపయోగించుకుని, పిడుగుపాటుపై గ్రామాల్లో దండోరా వేయించడం ద్వారా జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ కమలాకర్

ప్రజాశక్తి-ముండ్లమూరు

ముండ్లమూరు ఉన్నత పాఠశాలలో ముండ్లమూరు యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎస్సై కె.కమలాకర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు బేతపూడి రామారావు బౌలింగ్ చేయగా ఎస్సై బ్యాటింగ్ చేసి సిక్స్ కొట్టి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 36 జట్లు పాల్గొన్నాయి. మొదటిరోజు గంగవరం, శంకరాపురం జట్లు తలపడ్డాయి. శంకరాపురం జట్టు మొదట బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 129 పరుగులు చేసింది. 130 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన గంగవరం జట్టు 8 వికెట్ల నష్టానికి 20 ఓవర్లలో 130 పరుగులు సాధించి విజయం సాధించింది. ఈ పోటీలలో హెచ్‌ఎం మాధవి లత, టిడిపి నాయకులు బేతపూడి రామారావు, రావూరి దుర్గాప్రసాద్, బేతపూడి రాధాకృష్ణ, కావూరి రామయ్య, ఆనం నాగేశ్వరరావు, కుమిత పేరారెడ్డి, తాతపూడి పెద్ద రోశయ్య, క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

స్నేహహస్తం ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

ప్రజాశక్తి-కనిగిరి

ఆర్టీసీ కండక్టర్, దళిత నాయకుడు చాట్లా ప్రసాద్ రావు వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు డార్విన్, హిమ వర్ధన్‌లు కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వారి బంధువులకు, యాచకులకు, మతిస్థిమితం లేని వారికి సోమవారం అన్నదానం చేశారు. డార్విన్, హిమవర్ధన్ మాట్లాడుతూ తన తండ్రి ప్రసాదరావు వృత్తి పట్ల, సమాజం పట్ల అంకిత భావంతో ప్రతినిత్యం దళిత బహుజనులు పేద ప్రజల కోసం ఆలోచించే మంచి వ్యక్తిన్నారు. సమాజాన్ని, కుటుంబాన్ని సమపాళ్లలో చూసుకుంటూ మాకు ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని హుందాతనాన్ని నేర్పారన్నారు. స్నేహహస్తం అధ్యక్షులు సుధీర్ బాబు మాట్లాడుతూ ప్రసాద్ రావు వర్ధంతి సందర్భంగా పేదలకు ఆకలి తీర్చడం ఎంతో సంతోషంగా ఉందని ఇటువంటి సేకార్యక్రమాలకు ఎల్లప్పుడు మా స్నేహ హస్తం అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహ హస్తం సభ్యులు, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది శంకర్, దుర్గం బాప్టిస్ట్ చర్చ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న వైసీపీ నాయకులు

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-దర్శి

దర్శి మండలం లంకోజనపల్లి గ్రామంలో ఇటీవల ఆటో ప్రమాదంలో గాయపడి నరసరావుపేట హాస్పిటల్లో చికిత్స పొంది ఇంటికి వచ్చిన ఐదు మంది బాధితులకు సోమవారం దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఒక్కొక్కరికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. దర్శి మండల పార్టీ అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, రాష్ట్ర మున్సిపాలిటీ వింగ్ ప్రధాన కార్యదర్శి కుమ్మెత అంజిరెడ్డి, దర్శి పట్టణ అధ్యక్షులు మొత్తినీడి సాంబయ్య మరియు వైస్ ఎంపీపీ కొరివి మునలయ్యయాదవ్, సర్పంచ్ కొరివి చిన్నకోటయ్యలు గ్రామంలో బాధితులకి సాయాన్ని సోమవారం అందజేశారు.

ప్రజాశక్తి
మంగళవారం 6 మే 2025

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - పర్చూరు


డాక్టర్ అరుణ్ కుమార్

వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ అరుణ్ కుమార్ అన్నారు. సిహెచ్‌సి ఆవరణలో సోమవారం ప్రజలకు సూచనలు చేశారు. వేసవి వడగాల్పుల సమయంలో అత్యవసర పరిస్థితులు అనుకుంటేనే బయటకు రావాలని, లేకపోతే ఇళ్లలోనే ఉండాలని చెప్పారు. ప్రయాణాలుంటే ఉదయం, సాయంత్రం చేసుకోవాలని సూచించారు. చిన్న పిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎండ తట్టుకునేందుకు శీతల పానీయాలు, సోడాలు వంటివి తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదికాదని అన్నారు. వాటిని సేవించటం వలన శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుందని అన్నారు. రక్తంలో పాస్ఫరస్ అధికంగా చేరుతుందని, దీనివల్ల ఎముకలు, దంతాలు, కిడ్నీ సంబంధింత ఇబ్బందులు వస్తాయన్నారు. వీటిని సాధ్యమైనంత వరకు తీసుకోకపోవడం మంచిదని అన్నారు. ప్రతి ఒక్కరూ ఎక్కువగా నీరు తాగాలని అన్నారు. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించేందుకు ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని అన్నారు. నీటి శాతం అధికంగా ఉండే పుచ్చకాయ, కర్బూజ కాయ, కీర దోస వంటివి క్రమం తప్పకుండా తీసుకోవాలని అన్నారు. వివిధ రకాల ఆకుకూరలు తీసుకోవడం మంచిదన్నారు. శరీరం నుంచి చెమట రూపంలో కోల్పోయిన లవణాలు తిరిగి పొందేందుకు మజ్జిగ, నిమ్మ రసం, కొబ్బరి నీళ్లు తీసుకోవాలని సూచించారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న తహసిల్దారు పి బ్రహ్మయ్య

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

బాటసారులు, ప్రయాణికులు వేసవిలో దాహార్తి తీర్చడానికి దాతలు సహకారంతో ఏర్పాటుచేసిన చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయని తహశీల్దారు పి బ్రహ్మయ్య అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బొమ్మల సెంటర్లో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ ఆయన సోమవారం ప్రారంభించారు. రోటరీ, దాతలు సహకారంతో మజ్జిగ పంపిణీ నిర్వహిస్తున్నట్లు రోటరీ సభ్యులు పేర్కొన్నారు. చిరు వ్యాపారులకు చెప్పులు, గొడుగు పంపిణీ చేశారు. అనంతరం ప్రయాణికులు, బాటసారులు, శ్రామికులకు పాయసం, మజ్జిగ పంపిణీ చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు అవసరమైన వాటిని దాతల సహకారంతో అందిస్తున్న రోటరీ ప్రతినిధులను అభినందించారు. హైదరాబాదుకు చెందిన రాజేష్ మజ్జిగ పంపిణీకి సహకరించినట్లు క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ తెలిపారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు జి శ్రీనివాసరావు, సపోర్ట్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రం పాల్గొన్నారు.

11న ఉచిత షుగర్ వైద్యశిబిరం

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఈనెల 11న ఆదివారం మండలంలోని గంగవరంలో మంచాల వెంకట రంగమ్మ, రామయ్య విద్యా, వైద్య, వైజ్ఞానిక కళ్యాణ మండపంలో ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహించే ఉచిత షుగరు వైద్య శిభిరంలో పరీక్షలు, మందుల పంపిణీ నిర్వహిస్తున్నట్లు గంగవరం సంరక్షణ కమిటీ, కన్వీనర్ కె బాలచంద్ర తెలిపారు. మెడికల్ క్యాంపుకు షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ మంచాల రమేష్ కుమార్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఎ సాంబయ్య వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ క్యాంపుకు కరి సత్యనారాయణరావు (మాస్టారు) స్మారకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఆర్థిక సహకారం అందిస్తున్నారని తెలిపారు. మెడికల్ క్యాంపును పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎప్పుడూ వచ్చే పేషెంట్లు కాకుండా కొత్త వారికి ఈ

ఐఎల్‌టిడి ఫెడరేషన్ నుండి బహిష్కరించాం

- కె శ్రీను, జి సుధీర్‌లకు యూనియన్‌తో ఎలాంటి సంబంధం లేదు
- యూనియన్ విధానాలను వ్యతిరేకించినందుకే చర్యలు
- ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి సుధాకర్

ప్రజాశక్తి - చీరాల

ఐఎల్టిడి వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) యూనియన్ విధి విధానాలకు వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన బ్రాంచ్ కార్యదర్శి గంటా సుదీర్, ఆఫీసు బెరరు కురేటి శ్రీనివాసరావును ఏపీ ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్టిడి కంపెనీ వర్కర్స్ (సిఐటియు) నుండి చీరాల బ్రాంచ్ కమిటీ తీర్మానం మేరకు సోమవారం బహిష్కరించినట్లు రాష్ట్ర అధ్యక్షులు జి సుధాకర్ తెలిపారు. ఇక ఈ విషయా న్ని ఐఎల్టిడి కంపెనీ చీరాల పర్సనల్ మేనేజర్ ఎన్ రామ కృష్ణకు లెటర్ రూపంలో తెలియజేసినట్లు తెలిపారు. బ్రాంచ్ కార్యదర్శి జి సుధీర్ ఫెడరేషన్ రాష్ట్ర రికార్డును స్వాధీనం చేసుకుని అక్రమ చర్యకు పాల్పడ్డాడని అన్నారు. రికార్డులను రాష్ట్ర కేంద్రంకు ఇవ్వమని పలుమార్లు కోరిన ఖాతరు చేయకుండా వ్యవహరించాడని, యూనియన్లో గ్రూపులు రెచ్చగొట్టి లేబర్ కమిషనర్‌కు యూనియన్‌పై పిర్యాదు కూడా చేశారని అన్నారు. అయితే ఇది యూనియన్ వ్యతిరేక చర్యని, ఎన్నిసార్లు చెప్పినా పద్ధతి మార్చు కోని పరిస్థితుల్లో యూనియన్ బ్రాంచ్ కమిటి తీర్మానం మేరకు గంటా సుదీర్, కూరేటు శ్రీనులను సిఐటియు అనుబంధ సంఘం ఫెడరేషన్ నుండి అనివార్య పరిస్థితు ల్లో యూనియన్‌ను కాపాడుకోవడానికి బహిష్కరించినట్లు తెలిపారు. ఇక నుండి ఫెడరేషన్ (సిఐటియు)కు వీరికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ గౌరవాధ్యక్షుడు ఎం వసంతరావు, బ్రాంచ్ అధ్యక్షుడు బోయిన పోతురాజు, రాష్ట్ర కోశాధికారి పఠాన్ కాలేషా, చింతా శ్రీనివాసరావు, కొండ్రు ఎలీషా, కోయ పోతురాజు, సిహెచ్ భాస్కర్, తిరుమలరావు, ఎం నాగరాజు పాల్గొన్నారు.

పొగాకు మొత్తం కొనేవరకూ ఐక్యంగా నిలబడాలి

నూజెళ్లపల్లి దళిత కాలనీలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు

ప్రజాశక్తి - పంగులూరు


రైతులతో మాట్లాడుతున్న తలపనేని రామారావు

రైతు, కౌలు రైతు సంఘాల పోరాట ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చి పొగాకు కంపెనీలతో మాట్లాడిందని, రైతుల దగ్గర ఉన్న పొగాకు మొత్తం కొనే వరకు రైతులు ఐక్యంగా నిలబడి కొనుగోలు చేయించుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు రైతులకు సూచించారు. మండలంలోని నూజిల్లపల్లి దళిత కాలనీలో కౌలు రైతులతో ఆయన సోమవారం రాత్రి మాట్లాడారు. పొగాకు కంపెనీలు చెప్పిన మాటలు నమ్మి అధిక విస్తీర్ణంలో బర్లీ పొగాకు సాగు చేశారని అన్నారు. నల్లబర్లి పొగాకును కొనేందుకు కంపెనీలు ముందుకు రాలేదని, దీనిపై రైతు, కౌలు రైతు సంఘం గత రెండు నెలలుగా అనేక పోరాటాలు చేసిందని అన్నారు. ఆ పోరాటాల ఫలితంగానే అధికారులు, మంత్రులు, కదిలి చర్చలకు వచ్చారని అన్నారు. కంపెనీ యాజమాన్యాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో బర్లీ పొగాకు కొంటామని కంపెనీలు హామీ ఇచ్చారని అన్నారు. అయితే గిట్టుబాటు ధరకు కొనే విధంగా కంపెనీలపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. గిట్టుబాటు ధర ఇచ్చి రైతుల దగ్గర ఉన్న పొగాకు మొత్తం కొనుగోలు చేసేవరకు పోరాటం ఆగదని అన్నారు. ఇప్పటివరకు పోరాటంలో అండగా నిలిచిన రైతులు, కౌలు రైతులకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో జరిగే పోరాటాలకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతులు విప్పర్ల సాయి సంజీవ, సానం సుబ్బారావు, కవల రాజేష్, డోలా దయారత్నం, విజయ్ కుమార్, విప్పర్ల శ్రీనివాసరావు, బంగారు, గురుస్వామి, బెజ్జం లక్ష్మణరావు, ఆంజనేయులు, వెంకటరావు, మధు, తానికొండ హనుమంతరావు, కవల కిషోర్, విప్పర్లు పున్నారావు, గాల ప్రభాకరరావు పాల్గొన్నారు.


డిఎంహెచ్ఒకు సమ్మె నోటీసు అందిస్తున్న నాయకులు

20న సమ్మెకు సిద్ధమైన ఆశా వర్కర్లు

ప్రజాశక్తి - బాపట్ల

మే 20న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో ఆశా కార్యకర్తలు పాల్గొంటున్నట్లు ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం వెంకటేశ్వరమ్మ తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి ఎస్ విజయమ్మకు సమ్మె నోటీసు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, గత సమ్మె సందర్భంగా ఆమోదించిన డిమాండ్స్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా కార్మిక వర్గానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ జరుగుతున్న సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ పాల్గొన్నారు.

రథోత్సవ సన్నాహాల పర్యవేక్షణ

ప్రజాశక్తి - బాపట్ల


రథాన్ని పరిశీలిస్తున్న నరేంద్రవర్మ

చరిత్ర గల భావనారాయణ స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 12న జరిగే రథోత్సవానికి దేవాలయంలోని 400 యేళ్ల నాటి పాతరథం స్థానంలో రెండేళ్లుగా శ్రమించి నూతన రథం సిద్ధమంచేశారు. ఈ రథం నిర్మించిన శిల్పులకు రథం నిర్మాణంలో కనీసం ప్రాథమిక అవగాహన లేకపోవడంతో కొత్త రథం నిర్మాణంలో చోటు చేసుకున్న సాంకేతిక కారణాలతో కొత్త రథాన్నే తిరిగి ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో బాపట్లకు చెందిన కార్పెంటర్లతోనే రథాన్ని పునర్నిర్మించాల్సిన పరిస్థితి ఎదురైంది. రథం పనులను ఆయన సోమవారం పరిశీలించారు. రథం లాగేందుకు అవసరమైన ప్రత్యేక మోకును సిద్ధం చేశారు. కార్యక్రమంలో ఈఓ దివి వెంకటేశ్వర్లు, ధర్మకర్తలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఉచితంగా మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - బాపట్ల

ప్రజా సమస్యల పరిష్కార వేదికు జిల్లా నలుమూలల నుండి విచ్చేసే అర్జీదారులకు బాపట్ల ఫ్రెండ్స్ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఉచితంగా మజ్జిగ పంపిణీని జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ డైరెక్టర్ నాగిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

బౌద్ధ స్తూపానికి నూతన హంగులకు చర్యలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు


బౌద్ధ స్తూపంపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీఒ

దేశంలోనే ఎంతో ప్రాధాన్యత కలిగిన ప్రాచీన బౌద్ధ స్తూప అభివృద్ధికి నూతన హంగులు దిద్దేందుకు తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా పర్యటన శాఖ అధికారి ఎం నాగిరెడ్డి తెలిపారు. జై భారత్ భీమ్ పార్టీ నాయకులు ఇటీవల కలెక్టర్‌ను కలిసి భట్టిప్రోలు బౌద్ధ స్థూపం అవృద్ధికై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాలతో పర్యాటక, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సోమవారం బౌద్ధ స్తూపాన్ని పరిశీలించారు. బౌద్ధ స్తూపం పక్కనున్న చెరువులో గత తెలుగుదేశం ప్రభుత్వం పాలనలో ఏర్పాటు చేసిన జ్ఞాన బుద్ధ విగ్రహ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. ధ్యాన బుద్ధ విగ్రహ నిర్మాణం పనులు అర్ధాంతరంగా ఆగిపోవటాన్నికి కారణాలను సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. గతంలో ధ్యాన బుద్ధ విగ్రహ నిర్మాణానికి రూ.50లక్షల నిధులు మంజూరయ్యాయని, వాటితో పనులు జరుగుతుండగా ఎన్నికలు సమీపించడంతో అర్ధాంతరంగా నిలిచిపోయినట్లు గ్రామస్తులు వివరించారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందించిన రమేష్ రాంజీ, దారం సాంబశివరావు, కొనకాల ప్రసాద్ ఈ నెల 12న జరగనున్న బౌద్ధ పూర్ణిమ ఉత్సవాలు నిర్వహించాలని కోరారు.

జ్ఞాన బుద్ధ విగ్రహ నిర్మాణాన్ని కొనసాగిస్తాం

ఈ సందర్భంగా పర్యాటక శాఖ అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఉత్సవాలు నిర్వహించడానికి సమయం తక్కువగా ఉండటంతో దీనిపై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. సమయం చాలకపోతే స్థానిక బౌద్ధ అంబేద్కరిస్టులు గతంలో మాదిరిగానే నిర్వహించుకోవాల్సి ఉంటుందన్నారు. రేపల్లె ఆర్డీఒ రామలక్ష్మి మాట్లాడుతూ బౌద్ధ స్తూప అభివృద్ధికి అవసరమైన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తీసుకోవాల్సిన చర్యలు వివరిస్తామని అన్నారు. కార్యక్రమంలో డిఎల్పిఓ శ్రీనివాసన్, తహశీల్దారు మేక శ్రీనివాసరావు, ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ, సర్పంచ్ దారా రవికిరణ్మయి చెన్నయ్య, కార్యదర్శి కోట శ్రీనివాసరావు, పిఆర్ ఎఇ రామచంద్రరావు, అన్నం సురేష్, జడ రవీంద్ర పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్యలు వింటున్న ఎస్‌పి దామోదర్

బాధితులకు న్యాయం అందించటమే లక్ష్యం

ఎస్‌పి ఏఆర్ దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బాధితులకు సత్వర న్యాయం అందించటమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (మీ కోసం) కార్యక్రమాన్ని ఎస్‌పి నిర్వహించారు. జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన 80 ఫిర్యాదిదారులు వారి అర్జీలను జిల్లా ఎస్‌పి, పోలీస్ అధికారులు అందజేశారు. అర్జీదారులతో ఎస్‌పి ముఖాముఖిగా మాట్లాడి ఫిర్యాదులఉ సవివరంగా అడిగి తెలుసుకుని వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని వారికి భరోసా కల్పించారు. అందిన ఆయా ఫిర్యాదుల గురించి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం అందించేలా చూడాలన్నారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని అధికారులను జిల్లా ఎస్‌పి ఆదేశించారు. కార్యక్రమంలో ఎక్కువగా భూ వివాదాలు, కుంటుంబ సమస్యలు, చీటింగ్, ఇతర సమస్యలపై ప్రజా పిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో మహిళా పియస్ డిఎస్‌పి రమణ కుమార్, ఒంగోలు రూరల్ సిఐ ఎన్. శ్రీకాంత్ బాబు, ఒంగోలు ట్రాఫిక్ సిఐ వై. పాండు రంగా రావు, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ జగదీష్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు రజియా సుల్తాన్ పాల్గొన్నారు.

సంపదను కొల్లగొట్టేందుకే ఆపరేషన్ కగార్

ప్రజాశక్తి -ఒంగోలుసిటీ

మావోయిస్టుల అణచివేత, ఆపరేషన్ కగార్ పేరుతో పారా మిలటరీ దళాలను అడవుల్లోకి దింపి అమాయక ఆదివాసులను చంపుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య ధ్వజమెత్తారు. సోమవారం ఒంగోలులోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఈశ్వరయ్య మాట్లాడారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా 'ఆపరేషన్ కగార్'ను నిర్వహిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం చెప్పినప్పటికీ అడవులలో జీవించే ఆదివాసులను తరిమికొట్టి అటవీ ఖనిజ సంపద, ప్రకతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడమే లక్ష్యంగా బూటకపు ఎన్‌కౌంటర్లు నిర్వహిస్తున్నారని ధ్వజమెత్తారు. అమాయక ఆదివాసి గిరిజనులు ఊచకోచకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని, మావోయిస్టు పార్టీల నాయకులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపి శాంతి యుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట్రావు పాల్గొన్నారు.

ఎస్‌టిల వర్గీకరణ చేపట్టాలి

యానాది రిజర్వేషన్ పోరాట సమితి డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఎస్టీల వర్గీకరణ చేపట్టి తరతరాలుగా అణచివేతకు గురౌతున్న వాటి ఉపకులాలకు న్యాయం చేయాలని యానాది రిజర్వేషన్ పోరాట సమితి డిమాండ్ చేసింది. ఎస్సీల మాదిరిగా ఎస్టీలకు వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ యానాది రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం నాడు ప్రకాశం భవన్ వద్ద ధర్నా చేపట్టారు. సంఘ జిల్లా అధ్యక్షులు కొమరగిరి మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా లో రాష్ట్ర అధ్యక్షులు కె సి పెంచలయ్య మాట్లాడారు. వర్గీకరణ కోసం తాము కుప్పం నుంచి పాదయాత్ర చేపడతామని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందించారు. ధర్నాలో గిరిజన ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పేరం సత్యం, ప్రజాకవి పిన్నిక శ్రీనివాస్, రాష్ట్ర యానాది ఉద్యోగ సంఘ అధ్యక్షులు చేవూరి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చెల్లంచర్ల పెద బ్రహ్మయ్య, యానాది సంక్షేమ సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిల్డ్రన్ సమ్మర్ క్యాంపు ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



సమ్మర్ క్యాంపులో చిన్నారులతో నిర్వాహకులు

ప్రకాశం బాలోత్సవం ఆధ్వర్యంలో చిల్డ్రన్ సమ్మర్ క్యాంపును ఒంగోలులోని ఎల్‌బిజి భవన్‌లో సోమవారం నాడు ప్రారంభించారు. మొదటి రోజు ఆటలు ఆడించడం, పేపర్లతో బొమ్మలు చేయడం, పేపర్ కటింగ్‌తో కొత్త ఆకారాలు చేయడం, వారి అభిరుచులకు తగిన విధంగా, స్వేచ్ఛగా, ఆడుతూ, పాడుతూ క్యాంప్ సాగింది. వేసవి కాలంలో విద్యార్థులు సెల్‌ఫోన్, టివిలకు బానిసలు కాకుండా వారిలోని సృజనాత్మకతను బయటికి తీసేందుకు వారిలో దేశభక్తి భావాలు నింపేందుకు ఇటువంటి సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పది రోజులు జరిగే ఈ క్యాంపు విద్యార్థుల అభివృద్ధికి తప్పకుండా ఉపయోగపడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం క్రాఫ్టింగ్ టీచర్లుగా ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి, పిఎన్‌ఎం నగర కార్యదర్శి ఇంద్ర జ్యోతి, వీరాస్వామి, మ్యాజిక్ రామన్, వినోద్ ఉన్నారు. క్లాసుల నిర్వహణకు కోనంకి వరుణ్‌కుమార్ సహకారం అందించారు.

కళ్లకు గంతలతో నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

విలేజ్ క్లినిక్స్‌లో పనిచేస్తున్న 'కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల' సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శరత్‌బాబు, కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. విలేజ్ క్లినిక్ల్లో పనిచేస్తున్న సిహెచ్‌ఓల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమ్మె ఏడో రోజుకు చేరింది. సోమవారం నాడు ప్రకాశం భవనం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు పాల్గొని సంపూర్ణమైన మద్దతు ప్రకటించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వైద్య సిబ్బంది వినూత్నంగా కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తూ సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఆరు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న సిహెచ్‌ఒలను క్రమబద్ధీకరించాలని నేషనల్ హెల్త్ మిషన్ పాలసీకనుగుణంగా 23 శాతం వేతనం పెంచాలని, ఇంక్రిమెంట్ పాలసీ ప్రారంభించడంతో పాటు ఇపిఎఫ్‌ఒ సౌకర్యం పునరుద్ధరించాలని, ఎక్స్‌గ్రేషియా పాలసీ అమలు చేయాలని, నిర్దిష్టమయిన జాబ్‌చార్ట్ అమలు చేయడం.. ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. సమ్మె చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల గత నెల జీతం ప్రభుత్వ ఉన్నతాధికారులు నిలుపుదల చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం గౌరవ హెల్త్ మినిస్టర్‌ను సంప్రదిస్తే, మీరు కాంట్రాక్టు ఉద్యోగులు అని బెదిరింపు ధక్షరణిలోనూ, సిబ్బంది పట్ల, నర్సింగ్ వ్యవస్థ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి మాటలను అసోసియేషన్ తరుపున ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ అసోసియేషన్ ఒంగోలు తాలూకా ప్రెసిడెంట్ మంజీష్, ఏపీఎంసిఎ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందగిరి రాజేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీకాంత్, ప్రకాశం జిల్లా సెక్రెటరీ ప్రసన్న, ఉపాధ్యక్షులు ఎన్.జీవన్‌జ్యోతి, జె.రమేష్, రామాంజినేయులు, కామేష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గురైన

కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

- రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పిడుగుపాటుకు గురై మరణించిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి డిమాండ్ చేశారు. గొర్రెలు, మేకలు మేపుకొని జీవించే కష్టజీవులు దురదృష్టవశాత్తు పిడుగుపాటుకు మరణించడం బాధాకరమన్నారు. పెద్దబ్బాయి సోమవారం నాగులుప్పలపాడు మండలం ఈదుమూడిలో పిడుగుపాటుకు గురై మృతిచెందిన నాగమల్లేశ్వరరావు మతదేహాన్ని ఒంగోలులోని రిమ్స్ హాస్పిటల్ వద్ద పరిశీలించి.. సంతాపం ప్రకటించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. మతునికి భార్య, ఇద్దరు పిల్లలతో పాటు ఆధారపడిన తల్లిదండ్రులు ఉన్నారు. కుటుంబానికి ప్రధాన పోషకుడైన నాగమల్లేశ్వరరావు మృతితో కుటుంబం తీవ్రమైన ఇబ్బందులలోకి వెళుతుంది. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి 25 లక్షల రూపాయలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఒంగోలు మండలం దేవరంపాడులో వడ్లమూడి శిరీష, చినగంజాం మండలం సోపిరాల(బాపట్ల జిల్లా) సమీపంలో రొంపేరు కాలవ వద్ద పశువుల కాపరి గడ్డం బ్రహ్మయ్య మరణించినట్లు తెలిపారు. ఈ ఘటనలన్నీ ఒకే రోజు వివిధ ప్రాంతాలలో చోటు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇతర ప్రాంతాలలో చనిపోయిన గొర్రెల కాపరుల కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏపీ గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం ప్రకాశం జిల్లా కమిటీ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వత్తి సంఘాల నాయకులు పూసపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యావ్యవస్థను కాపాడుకుందాం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే 117 జిఒ రద్దు చేసినప్పటికీ మెరుగైన విద్యావిధానం రూపొందలేదని ఎపిటిఎఫ్ విమర్శించింది. కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో చేపట్టిన మార్పు ప్రభుత్వ రంగ పాఠశాలల మనుగడకు ప్రశ్నార్ధకంగా పరిణమిస్తుందని ఆరోపించారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర వ్యాప్తపిలుపు మేరకు పాత తాలూకా పరిధిలో చేపట్టిన ధర్నా సోమవారం నాడు ప్రకాశం భవనం వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి మంజుల, సంఘ జోనల్ కన్వీనర్ బి శేషారావు, జిల్లా ఉపాధ్యక్షులు తిరుమల మాట్లాడారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందించారు.



ఎస్‌పి దామోదర్‌కి డ్రోన్ కెమెరా అందజేస్తున్న కాశీరావు

నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా

ఎస్‌పి ఏఆర్ దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నేరాలు, ట్రాఫిక్ నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా పెట్టినట్లు జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ తెలిపారు. తర్లుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా, ఇతర పోలీసింగ్ అవసరాల కోసం గ్రామానికి చెందిన బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్న చేవెలుగు కాశీరావు సోమవారం జిల్లా ఎస్పీ గారి కార్యాలయంలో ఎస్పీకి అత్యాధునిక సాంకేతికతతో కూడిన డిజెఎల్ ఏయిర్ 3ఎస్ డ్రోన్ కెమెరాను జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు. ఆ డ్రోన్‌ను తర్లుపాడు పోలీస్ స్టేషన్ కు జిల్లా ఎస్‌పి అందచేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని స్మార్ట్ పోలీసింగ్ విధానంతో ముందుకు సాగుతున్న ప్రకాశం జిల్లా పోలీస్ శాఖకు సామాజిక బాధ్యతగా డ్రోన్ బహుకరించటం అభినందనీయమన్నారు. ఈ డ్రోన్ కెమెరా ద్వారా శాంతి భద్రతలు, నేర నియంత్రణ, , ముఖ్యమైన కేసుల్లో క్రైమ్ సీన్ మానిటరింగ్ ద్వారా నేర దృశ్యాలు సాక్షాల సేకరణకు ఉపయోగపడుతుందన్నారు. పలు బందోబస్తులు, బహిరంగ సభలు, జాతరలలో అవాంఛనీయ సంఘటనలు నిలువరించుట, విపత్తు సమయంలో రెస్క్యూ సహాయక చర్యలు, తప్పిపోయిన వ్యక్తులు/అనుమానితులను గుర్తించడం వంటి టార్గెట్ ట్రాకింగ్ కు డ్రోన్ కెమెరా ఉపయోగపడుతుందన్నారు. పోలీసుల సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుస్తుందని, తద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించటానికి దోహదపడుతుందన్నారు. డ్రోన్ కెమెరా బహూకరించిన స్టాఫ్‌వేర్ ఉద్యోగి సిహెచ్ కాశీరావుకు ఎస్‌పి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో దర్శి డిఎస్‌పి లక్ష్మీనారాయణ, సిఐ వెంకటేశ్వర్లు, తర్లుపాడు ఎస్సై బ్రహ్మానాయుడు, సిబ్బంది ఉన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



లోకేష్‌కు అర్జీ ఇస్తున్న నాయకులు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను కాంట్రాక్ట్ లెక్చరర్స్ జెఎసి నేతలు కోరారు. 2024 మే నెల పనిచేసిన గత సం. మే-2024 నెల కాలానికి జీతాన్ని మంజూరు చేయాలన్నారు. ఉండవల్లి లోని సిఎం నివాసం వద్ద సోమవారం జరిగిన ప్రజా దర్బార్‌లో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ రాష్ట్ర చైర్మన్ కుమ్మరకుంట సురేష్ , కో చైర్మన్ కల్లూరు శ్రీనివాస్ కలిసి అర్జీ అందించారు. పెండింగ్ జీతం విషయంలో ఇప్పటికే ప్రభుత్వం రెండుసార్లు ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపించిన ఆమోదం లభించక వెనుకకు వచ్చిందని, చొరవ తీసుకొని పనిచేసిన కాలానికి జీతాలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.దీంతోపాటు రానున్న విద్యా సంవత్సరానికి(2025-2026) కొనసాగింపు ఉత్తర్వులు ఈ నెలలో ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయి ప్రస్తుతం అడ్వకేట్ జనరల్ (ఏజి) ఒపీనియన్ కోసం ఉన్న కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్ ఫైల్ పై ప్రత్యేక శ్రద్ధ చూపి రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాలపై విద్యా మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారు.

అపరాలకు కనీస మద్దతు ధర

ప్రజాశక్తి - పర్చూరు

రబీ సీజన్లో సాగుచేసిన అపరాల పంటలైన మినుము, పెసలు, శనగలకు ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రభుత్వం కల్పిస్తున్నట్లు ఎపి మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ సోమవారం తెలిపారు. సాగు చేసిన రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ వివరాలుతో కూడిన కరపత్రాన్ని ఆయా సచివాలయాలు, పంచాయతీల నోటీసు బోర్డులో రైతులు, ప్రజలకు తెలిసే విధంగా ప్రదర్శించినట్లు తెలిపారు. ఎపి మార్క్ ఫెడ్ ద్వారా పెసలు క్వింటా రూ.8682, మినుము రూ.7400, శనగలు రూ.5650లకు రైతుల నుండి కొనుగోలు చేస్తారని తెలిపారు. అయితే మార్క్ఫెడ్ నాణ్యత ప్రమాణాలు పాటించి ఉండాలని చెప్పారు. ఆపరాల గింజలు తేమశాతం 12శాతం కంటే తక్కువ ఉండాలని చెప్పారు. ఇతర పదార్థాలు రెండు శాతంలోపు, ఇతర గింజలు ఒక శాతం లోపు, ముతక గింజలు మూడు శాతం లోపు, విరిగిన, పురుగు పట్టిన గింజలు మూడు శాతం లోపు ఉండాలని తెలిపారు. రైతులు తమ పంట రబిలో సాగు చేసినప్పుడు ఈ క్రాపులో నమోదు చేసి ఉండాలని పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రంలో కలిసి పీఎం యాప్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ముందుగా రైతులకు ఖాళీ సంచులు ఇవ్వనున్నట్లు చెప్పారు. రైతుల బ్యాంక్ అకౌంటు, ఆధార్ కార్డు అనుసంధానం చేసుకొని ఉండాలని తెలిపారు. కొనుగోలు కేంద్రానికి వచ్చేటప్పుడు రైతులు ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు. రైతులు తమ పంటను పొలం నుండి కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకొని వచ్చేటప్పుడు అయిన ఖర్చులు కొనుగోలు కేంద్ర వద్ద కాటా, లారీలకు లోడ్ చేసేంతవరకు అయ్యే ఖర్చు రైతులే భరించాలని చెప్పారు. రైతులు కొనుగోలు కేంద్రం వద్ద మద్దతు ధర పొందేందుకు ఎటువంటి ఖర్చులు కొనుగోలు కేంద్రం సిబ్బందికి చెల్లించవలసిన అవసరం లేదని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ఏదైనా సమస్యలు ఉంటే జిల్లా మార్క్ఫెడ్ అధికారులకు తెలియపర్చాలని చెప్పారు.



నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

సజ్జా దివ్యశ్రీకి నగదు ప్రోత్సాహం

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని పందిళ్ళపల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థులు గౌరాబత్తుని బుల్లయ్య కుమారులు సాఫ్ట్ వేర్ ఉద్యోగులైన శివనాగ కిషోర్, శివనాగ సాయి 596 మార్కులు సాధించిన సజ్జా దివ్యశ్రీకి రూ.3వేల నగదు ప్రోత్సాహం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా దాత గౌరాబత్తుని శివనాగ సాయి మాట్లాడుతూ తాను ఈ స్థాయికి రావడానికి తన తల్లి, దండ్రులు, తనకు చదువు నేర్పిన పాఠశాల కారణమని అన్నారు. అందుకనే తాను చదువుకున్న పందిళ్ళపల్లి హైస్కూల్లో 10వ తరగతిలో మంచి ప్రతిభ కనబరిచిన నిరుపేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తానని తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి జీవితంలో బాగా స్థిరపడిన తర్వాత చదువుకున్న పాఠశాలను మర్చిపోకుండా తనలాగే పేద విద్యార్థులను ప్రోత్సహించాలని సజ్జా దివ్యశ్రీకి సూచించారు. విద్యార్థిని తండ్రి రామకృష్ణ, హెచ్ఎం మెడబలిమి శేఖరరావు, ఉమ్మిటి వేణుగోపాలరావు, గుంటూరు శివశంకర్, బండ్ల శ్రీను దాతలకు ధన్యవాదాలు తెలిపారు. సాధారణ విద్యార్థినిని రాష్ట్రస్థాయి ప్రతిభావంతురాలిగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను కలెక్టర్, డిఇఒ, యుటిఎఫ్ నాయకులు, దేవాంగ సంక్షేమ సంఘం, దేవల మనుబ్రహ్మ సంక్షేమ సంఘం, చీరాల రామకృష్ణ సేవా సమితి అభినందించారు.

7న వాసవీ అమ్మవారి జయంతి

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని శ్రీ చక్ర సహిత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 7న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి నిర్వహిస్తున్నట్లు దేవస్థానం అధ్యక్షులు చిన్ని శ్రీనివాసరావు తెలిపారు.

అనుమతులు లేకుండా ఎర్రమట్టి తవ్వకాలు

- పది రోజులుగా యథేచ్ఛగా బెంగళూరు రోడ్డుకు తరలింపు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, మైనింగ్ అధికారులు
- అదృశ్యం అవుతున్న కొండమంజులూరు 'పిడకల తిప్ప'



పిడకలతిప్ప కొండను తవ్వుతున్న ప్రోక్లైనర్

ప్రజాశక్తి - పంగులూరు

బెంగళూరు – విజయవాడ జాతీయ రహదారి నిర్మాణం శరవేగంగా జరుగుతుంది. రోడ్డు నిర్మాణానికి మట్టి అవసరం ఏర్పడింది. పైసా ఖర్చు లేకుండా కావలసినంత మట్టి దొరికే కొండమంజులూరు గ్రామానికి చెందిన సర్వే నెంబరు 793లో ఉన్న 36ఎకరాల 74 సెంట్లు విస్తీర్ణం గల 'పిడకల తిప్ప' కొండ కాంట్రాక్టర్లకు కనిపించింది. మైనింగ్, రెవెన్యూ అనుమతులు లేకుండానే గత పది రోజులుగా జెసిబిలతో కొండను పిండి చేస్తున్నారు. రోజుకు వందల ట్రిప్పర్లతో మట్టి తరలిస్తున్నారు. స్థానిక ప్రజలు ఫిర్యాదు చేసిన, కళ్ళు ఎదుటే పకృతి సంపద అన్యాక్రాంతం అవుతున్న ఎలాంటి చర్యలు తీసుకోకుండా మైనింగ్, రెవెన్యూ అధికారులు గుడ్లప్పగించి చూస్తున్నారు. ఇదేమని ప్రశ్నించే సాహసం చేయలేకపోయారు. దీంతో యదేచ్ఛగా కొండమట్టి తరలిస్తున్నారు. ఎర్ర మట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాల్సిన అధికారులు మౌనం వహించడం పట్ల ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మాట్లాడే వారు లేరని ఇష్టం వచ్చినట్లు పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ మట్టి తరలింపు వెనుక రెవిన్యూ, మైనింగ్ అధికారుల అండదండలు ఉన్నాయని చెబుతున్నారు. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన పిడకల తిప్పను కొంతమంది తమ జేబులు నింపుకునేందుకు అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఎర్ర మట్టిని తరలించే క్రమంలో మట్టి లోడు లారీలు వెళ్లేందుకు వీలుగా పిడకల తిప్ప నుండి రోడ్డు మీదకు వచ్చేందుకు సుమారు 7 ఎకరాల పంట పొలాలు కౌలుకు తీసుకున్నట్లు తెలుస్తుంది. ఎకరా రూ.25 వేల నుండి రూ.30 వేల వరకు ఏడాది పాటు కౌలు ఇస్తామని చెప్పి అందులో రోడ్డు కూడా వేశారు. ఈ పొలాల గుండా వెళ్లే నాగార్జునసాగర్ కాలువ కూడా పూడ్చి చేసి రోడ్డు వేసినట్లు కొండ మంజూలూరు గ్రామస్తులు తెలిపారు.

రెండు రోజుల్లో ఎన్ఓసి వస్తుంది

అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న విషయం తహశీల్దారు పి సింగారావు దృష్టికి 'ప్రజాశక్తి' తీసుకెళ్లగా పది రోజులుగా ఎర్రమట్టిన తరలిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ఇంతవరకు మైనింగ్ అనుమతులు రాలేదని, రెండు రోజుల్లో ఎన్ఓసి వస్తుందని, ఆ ప్రయత్నాల్లో వాళ్ళు ఉన్నారని చెప్పారు. అనుమతి లేకుండానే మట్టి తరలిస్తుంటే మీరేం చేస్తున్నారని ప్రశ్నించగా మట్టి తవ్వకాలు ఆపాలని చెప్పామని, వాళ్లు మాట వినకుండా మట్టి తరలిస్తున్నారని అన్నారు.

రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులకు ఫిర్యాదు

గత పది రోజులుగా 'పిడకలు తిప్ప' నుండి అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారని, జెసిబి, టిప్పర్ల ద్వారా వందలాది టిప్పర్ల మట్టిని తరలిస్తున్నారని కొండ మంజులూరు సొసైటీ మాజీ అధ్యక్షులు బొప్పుడి వెంకన్నబాబు తెలిపారు. ఈ విషయమై రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశామని అన్నారు. అయినప్పటికీ వారు పట్టించుకోవటం లేదని విమర్శించారు. డబ్బులు దండుకొని పకృతి సంపద దోచుకుంటున్న పట్టించుకోవట్లేదని అధికారులపై విమర్శలు చేశారు. ఇప్పటికైనా అనధికారికంగా మట్టి తరలింపు అడ్డుకొని, ప్రకృతి సంపదను కాపాడాలని కోరారు.



మట్టిని తరలించేందుకు పంట పొలాల్లో వేసిన రోడ్డు



సాగర్ కాలువను పూడ్చి రోడ్డు వేసిన దృశ్యం

వ్యర్థాలు కాలువలో కలవకుండా చూడాలి

మాజీ మంత్రి పాలేటి రామారావు కమిషనర్, ఆర్డిఒకు వినతి

ప్రజాశక్తి - చీరాల

పురపాలక సంఘం పరిధిలోని దండుబాటు ప్రాం తం నుండి డ్రైనేజీ మురుగు నీరు, వ్యర్థాలు విజయ నగర కాలనీ వద్ద డ్రైనేజీ కాలువ మీదగా ఈపురిపాలెం స్ట్రెట్ కట్ కాలువలో కలుస్తున్నాయని, దీనిని నివారించాలని మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు అధి కారులను కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ అబ్దుల్ రషీద్ను, ఆర్డీఒ కార్యాలయంలో చంద్రశేఖర్ నాయుడుని కలిసి డ్రైనేజీ మురుగు నీరు పారుదలతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీ పరిధిలో ని మురుగు నీరు, డయింగ్ నుంచి వెలువడే వ్యర్థములు అన్ని దండుబాట మీదగా విజయనగర కాలనీ వద్ద ఈపురుపాలెం స్ట్రెయిట్ కట్ట కాలువలో కలుస్తున్నాయని అన్నారు. ఇలా కలవడం వల్ల రైతులు ఎంతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఈపురుపాలెం స్ట్రెట్ కట్ మీద గవినివారిపాలెం, అక్కయ్యపాలెం ఎత్తిపోతల పథకాలు ఉన్నాయని అన్నారు. ఈ ఎత్తిపోతల పథకాల క్రింద పిట్టువారిపాలెం, పచ్చమొగిలి, విజయ లక్ష్మీపురం, గవినివారిపాలెం, కొత్త వాడరేవు, బుర్లవారి పాలెం, వాకవారిపాలెం, కొత్తపేట, పాపాయిపాలెం, చెల్లారెడ్డిపాలెం గ్రామాలకు సంబంధించిన పదివేల ఎకరాల భూమి సాగు చేస్తున్నారని తెలిపారు. ఇటీవల ఈపురుపాలెం స్ట్రెట్ కట్ కాలువలోకి చీరాల పట్టణ పరిధిలోని మురుగు నీరు, వ్యర్థాలు కలవటం వల్ల నీరు కలుషితమై పంటలు దెబ్బతింటున్నాయని అన్నారు. త్రాగు నీరు కూడా కలుషితం అతున్నాయని అన్నారు. ఆ నీరు పశువులు తాగుట కూడా ఉపయోగపడటం లేదని తెలిపారు. ఆ కలుషిత నీరు తాగి ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని మురుగు నీరు, వ్యర్థ పదార్థాలు ఈపురుపాలెం స్ట్రెట్ కట్ కాలువలో కలవకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. లేకుంటే సీఎంకు పిర్యాదు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



కమిషనర్తో మాట్లాడుతున్న పాలేటి రామారావు

12న మండల సమావేశం

ప్రజాశక్తి - అద్దంకి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 12న ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపిడిఒ బి సింగయ్య తెలిపారు. ఎంపిపి అధ్యక్షతన జరిగే సమావేశానికి వివిధ శాఖల అధికారులు వారిపరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల నివేదికలతో హాజరు కావాలని కోరారు.

యద్దనపూడి : ఈ నెల 9న మండల సర్వ సభ్య సమావేశం ఎంపిడిఒ కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు జరిగిందని ఎంపిడిఒ లక్ష్మీనారాయణ తెలిపారు. సమావేశనికి అన్ని శాఖల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని కోరారు. ఎవరు గైరు హాజరు కావద్దని అన్నారు.

శాంతి భద్రతలకు ప్రాధాన్యం

ప్రజాశక్తి - రేపల్లె



డీఎస్పీ శ్రీనివాసరావు

సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు ఆధిక ప్రాధాన్యత, మహిళలపై ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడినా చట్టపరంగా సత్వరం శిక్షించేలా చర్యలు తీసుకుంటున్నామని డిఎస్పి ఎ శ్రీనివాసరావు 'ప్రజాశక్తి'కి తెలిపారు. తన పరిధిలో 12 పోలీసు స్టేషన్లు ఉన్నట్లు తెలిపారు. అన్ని స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్ సమస్య పరిశీలించినట్లు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రధాన కూడళ్ల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ క్రమబద్దీకరణ చేస్తున్నట్లు తెలిపారు. కార్లు నడిపేవారు సీటు బెల్ట్, ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించాలని అన్నారు. గంజాయి విషయంలో సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని అన్నారు. బాలికలు, మహిళలను వేధించే పోకిరీలను వదిలిపెట్టే ప్రసక్తి లేదని, మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని అన్నారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పించి ధైర్యంగా ఫిర్యాదు చేసేలా చర్యలు చేపట్టామని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తున్న పలువురు తల్లి, దండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. 18ఏళ్ల లోపు పిల్లలతో పనిచేస్తున్న వారిపై చర్య తీసుకుంటామని అన్నారు. హింసకు గురౌతున్న బాలలను గుర్తిస్తే 1098 లేదా 100 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

మద్యం సిట్టింగ్ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- రాచర్ల

పట్టణంలోని జిల్లా నీటి యాజమాన్య సంస్థ వాటర్ ప్లాంట్లో జరుగుతున్న మద్యం సిట్టింగ్ సెంటర్పై 'ప్రజాశక్తి' దినపత్రికలో సోమవారం కథనం ప్రచురణ కావడంతో గిద్దలూరు ఎక్సైజ్ శాఖ అధికారులు సోమవారం సాయంత్రం ఆ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అయితే ఎక్సైజ్ శాఖ అధికారులు వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న సిట్టింగ్ కేంద్రం నిర్వాహకులు హుటాహుటిన తాళం వేసి మూసివేశారు.



వీక్షణ సమావేశంలో కలెక్టర్ వెంకట మురళి

ఉద్యాన పంటలకు నష్టం లేదు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఉరుములు మెరుపులతో కురిసిన అకాల వర్షం, పిడుగుపాటుతో జిల్లాలో ఇద్దరు మృతి చెందారని కలెక్టర్ జె వెంకట మురళి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. అకాల వర్షం తెచ్చిన నష్టంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి సోమవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. మరో రెండు రోజులు వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సీఎం చెప్పారు. అధికారుల మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చూసుకోవాలన్నారు. విపత్తుల సమయాన్ని పరిగణనలోకి తీసుకుని అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ప్రాణ నష్టాన్ని పూర్తిగా అరికట్టడానికే ప్రవేశపెట్టిన వ్యవస్థను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనేక ప్రాంతాలలో విద్యుత్ పునరుద్ధరణ సమర్థంగా చేపట్టారని ప్రశంసించారు. అకాల వర్షం ధాటికి జిల్లాలో ఆరు పశువులు మృతి చెందాయని సీఎంకు వివరించారు. కేవలం మూడు మండలాల్లో మాత్రమే 77 ఎంఎం వర్షపాతం నమోదయ్యిందని, మిగిలిన ప్రాంతాల్లో వర్షం పడలేదన్నారు. ఇప్పటివరకు ఉద్యాన పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదన్నారు. వాతావరణ శాఖ నుంచి హెచ్చరిక రాగానే దిగువ స్థాయికి ఆ సమాచారాన్ని చేరవేశామన్నారు. సమావేశంలో డిఆర్ఒ జి గంగాధర్ గౌడ్, డాక్టర్ వేణుగోపాల్, రామకృష్ణ, జెన్నమ్మ పాల్గొన్నారు.



తహాశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అశాస్త్రీయ విధానం విడనాడాలి

ప్రజాశక్తి - బాపట్ల

రాష్ట్రంలో కొన్నేళ్లుగా విద్యా రంగం సంక్షోభంలో పడిందని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్ భాష ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని కోరుతూ తహాశీల్దారు షేక్ సలీమాకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చాంద్ భాషా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు వాటం తటవే మూతపడే దశకు చేరుకున్నాయని అన్నారు. వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతోపాటు ప్రజలపై ఉందన్నారు. జిఒ నెంబర్ 117 విద్యా రంగాన్ని అతలాకుతలం చేసిందని అన్నారు. కూటమి ప్రభుత్వం 117 జీవో రద్దు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొందని, జీవో రద్దు అయినప్పటికీ రూపం మార్చి అమలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాల స్వరూపాన్ని తొమ్మిది రకాలుగా విభజించి విద్యా వ్యవస్థకు ప్రభుత్వం తీరని నష్టం కలిగిస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను కాపాడాల్సిన ప్రభుత్వమే విద్యా వ్యవస్థను తప్పుదోవ పట్టించడం శోచనీయమని అన్నారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి జంపని శ్రీనివాసరావు, బాపట్ల, కర్లపాలెం, పిట్టలవాని పాలెం ఏపీటీఎఫ్ బాధ్యులు మురళి, నారాయణ, ప్రసాద్, బాలాజీ, కత్తి శ్రీనివాసరావు, నాగార్జున, రమణ, శ్రీనివాసరావు, దుర్గారావు, విజయబాబు పాల్గొన్నారు.

అద్దంకి : అసంబద్ధంగా పాఠశాలల విలీనం తొలగించాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో 1నుండి 5వ తరగతులు కలిగి ఉండాలని ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు అమర్తపూడి శేఖర్ బాబు అన్నారు. స్థానిక తహాశీల్దారు కార్యాలయం వద్ద ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ పాఠశాలల విధ్వంస విధానాలకు వ్యతిరేకంగా ఈ నిరసన చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మల్లాది నాగరాజు, కరి రామయ్య, అనపర్తి రమేష్ బాబు, జి ఎలిషా, చెంచు రామారావు, కోటేశ్వరరావు, రాజశేఖర్, కోటయ్య, నరసింహారావు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్యాలయం కరువాయే.!

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రజాజీవనంలో అత్యంత ప్రధానమైన వ్యవసాయ రంగానికి రైతులకు అనుసంధానంగా ఉండే వ్యవసాయ శాఖ కార్యాలయం మండలంలో ఎక్కడ కనిపించదు. ఐదారేళ్ల క్రితం వరకు వ్యవసాయ అధికారి భట్టిప్రోలు బస్టాండ్ పక్కన ఉన్న గోడౌన్‌లో విధులు నిర్వహించేవారు. ఈ గోడౌన్ పై కప్పు సిమెంట్ రేకులు కావడంతో అవి పగిలిపోయి శిథిలావస్థకు చేరి అధికారుల కార్యకలాపాలకు, రికార్డుల భద్రతకు రక్షణ లేకుండా పోయింది. దీంతో భట్టిప్రోలు రైతు సేవ కేంద్రం1లోకి మార్పు చేసుకొని వ్యవసాయ అధికారులు కార్యకలాపాల కొనసాగిస్తున్నారు. ఈ రైతు సేవా కేంద్రం కూడా అద్దె భవనంలోనే కొనసాగుతుంది. దీంతో అధికారులు, రైతులకు సొంత భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటివరకు కార్యకలాపాలు నిర్వహించిన గోడౌన్ అభివృద్ధి పర్చి కనీసం ప్రభుత్వం నుండి రైతుల కోసం వచ్చే విత్తనాలు, పురుగు మందులు, వివిధ రకాల సరుకులను భద్రపర్చుకోవడానికి ఉపయోగపడుతుంది. కానీ సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు దీనిపై దృష్టి సారించకపోవడంతో మరింత శిథిలావస్థకు చేరుతుంది. కూటమి ప్రభుత్వ పాలనలో రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, పురుగు మందులు పొందటానికి ఆ గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలు ఉన్నప్పటికీ మండల స్థాయిలో అధికారి కార్యాలయం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలో 15 వేల ఎకరాల సాగుభూమి ఉంది. 15 గ్రామాల పరిధిలోని ఈ సాగు భూమిలో సుమారు ఏడు గ్రామాల పరిధిలో మెట్ట భూమి కూడా ఉండటంతో దానిలో నిత్యం వాణిజ్య పంటలు సాగు చేస్తూ ఉంటారు. వీరందరికీ నిరంతరం వ్యవసాయ కార్యాలయంతో వివిధ అవసరాలు ఉంటాయి.



వ్యవసాయ కార్యాలయంగా కొనసాగిన గోడౌన్

భవన నిర్మాణానికి అవకాశం ఉన్నా పట్టించుకోరా?

వ్యవసాయ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి స్థానిక మార్కెట్ యార్డులో అవకాశం ఉన్నప్పటికీ అధికారులు ఎందుకు కృషి చేయడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. అనేక ప్రాంతాల్లో వ్యవసాయ కార్యాలయం వ్యవసాయ మార్కెట్ యార్డులోనే కొనసాగుతూ ఉంటుందని, భట్టిప్రోలులో అందుకు భిన్నంగా ఉందని రైతులు అంటున్నారు. మార్కెట్ యార్డులో వ్యవసాయ కార్యాలయం ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం మార్కెట్ యార్డులోని కార్యదర్శి కార్యాలయం ఖాళీగా ఉన్నందున దీనిలో వ్యవసాయ శాఖకు కేటాయిస్తే వినియోగించుకునే అవకాశం లేకపోలేదు. ఈ విషయంపై రేపల్లె ఎడిఎ విజయ్ బాబు మాట్లాడుతూ భట్టిప్రోలులో ఐదారేళ్లుగా వ్యవసాయ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో రైతు సేవ కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిధులవస్తుకు చేరిన గోడౌన్ కార్యాలయం పరమతులు చేపట్టి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నిల్వకు సిద్ధం చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. నూతన భవన నిర్మాణానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

చెరువులు ఆక్రమించకుండా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లాలో సాగునీటి చెరువులు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె వెంకట మురళి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి త్రాగునీటి చెరువులు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ, ఇరిగేషన్ , పంచాయ తీరాజ్ శాఖ అధికారులు, సర్వే శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టి గ్రామ పెద్దల సమక్షంలో హద్దులు ఏర్పాటు చేయాలని చెప్పారు. చెరువులకు హద్దులు నిర్ణయించిన బయో ఫెన్సింగ్ ఏర్పాటు చేయడానికి ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాలని చెప్పారు. నీటి పన్ను వారం రోజుల్లో నూరు శాతం వసూలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో గృహ నిర్మాణ శాఖ ద్వారా నిర్మించుకునే లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్, కుల, ఆదాయ సర్టిఫికెట్లను తహసీల్దార్లు వెంటనే ఇవ్వాలని చెప్పారు. పి4 పథకాన్ని అమలు చేయడానికి ప్రతి మండలానికి 200 మంది మార్గ దర్శకులను ఎంపిక చేయాలని చెప్పారు. మున్సిపాలిటీల్లో 500 వంతున ఎంపిక చేయాలని సూచించారు. బంగారు కుటుంబాలను 10 చొప్పున అధికారులు దత్తత చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్ఒ జి గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్‌డిఒ గ్లోరియా, ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, డిఆర్‌డిఏ పిడి శ్రీనివాసరావు, డ్వామా పిడి విజయలక్ష్మి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ, ఐసిడిఎస్ అధికారి రాధామాధవి, ఆర్‌టిఒ పరంధామరెడ్డి, వెంకటేశ్వర్రావు, పురుషోత్తం పాల్గొన్నారు.



అర్జీలు తీసుకుంటున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి

అర్జీలు పునరావృతం కాకుండా పరిష్కరించాలి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోపు చట్ట పరిధిలో విచారించి పరిష్కరించాలని ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు వారి సమస్యలను ఆయనకు స్వయంగా విన్నవించుకున్నారు. అర్జీదారుల సమస్యలను కూలంకషంగా విని వారు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. చట్ట పరిధిలో విచారించి అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. అర్జీలు పునరావతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. ఈరోజు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, అత్తారింటి వేధింపులు, భూ వివాదాలు ఇతర పలు సమస్యల పరిష్కారం కోసం 51 మంది ఫిర్యాదుదారులు తమ అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర, పిజిఆర్ఎస్ సెల్ ఎస్సై, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు స్వీకరిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

పొగాకు రైతులకు అందుబాటులో టోల్ ఫ్రీ నెంబర్లు

ప్రజాశక్తి - ఇంకొల్లు

బర్లీ పొగాకు కొనుగోలుకు రైతులకు అందుబాటులో ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్లను ఏర్పాటు చేసినది. రైతులు ఉపయోగించుకుని తమ పొగాకు అమ్ముకునేందుకు ఎక్కడ కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నెంబర్లను ఏర్పాటు చేసింది. పొగాకు అమ్మే సందర్భంలో ఎదురయ్యే సమస్యలు కూడా వీరికి విన్నవించుకోవచ్చు. పొగాకు కంపెనీలకు సంబంధించి కొనుగోలు సందర్భంగా బయర్లు ఏ విధంగా చెక్కులు పాసింగ్ చేస్తున్నది కూడా తెలుపవచ్చు. కంట్రోల్ రూంలో ఎన్ రమేష్ 83310 56024, ఎన్ నాగలక్ష్మి 9182361396, ఎన్ వంశి క్రిష్ణ 8331832171, ఎన్ శ్రీనివాసరావు 9703380766 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

మట్టి కుండలో నీటితో ఆరోగ్యం

ప్రజాశక్తి - అద్దంకి

ఎండలో బయటకు వెళ్లి వచ్చామంటే చల్లని నీరు తాగాలనిపిస్తుంది. వెంటనే ఇంట్లో ఫ్రిజ్ ఓపెన్ చేసి అందులోని నీరు తాగుతాం. అయితే వేసవిలో ఫ్రిజ్లోని చల్లని నీటికంటే మట్టి కుండలోని నీళ్ల ఆరోగ్యానికి మంచివని నిపుణులు సూచిస్తున్నారు. మట్టి కుండ సాధారణంగా ఒక ప్యూరిఫైయర్‌గా పనిచేస్తుంది. నీటిలో ఉండే మలినాలను, బ్యాక్టీరియా, ఫంగస్ వంటి వాటిని వడకట్టి మనకు శుద్ధమైన మంచినీటిని అందిస్తుంది.

మట్టి కుండ ప్రయోజనాలు

మట్టి కుండలో నీరు తాగితే జీవక్రియ రేటు పెరుగుతుంది. ఆహారం సక్రమంగా జీర్ణమయ్యేలా చేసి మలబద్ధకం సమస్య తగ్గిస్తుంది. శరీరంలో అవసరమైన పీహెచ్ స్థాయిలు మట్టికుండలోని నీరు సమతుల్యం చేస్తుంది. శరీరంలో ఆమ్లత్వాన్ని తగ్గిస్తుంది. కుండలో నీరు తాగితే ఉదర సంబంధిత వ్యాధులు తగ్గడంతోపాటు అజీర్తి, ఎసిడిటీ సమస్యలు తగ్గుతాయి. ఈ నీటిని తాగితే ఇందులోని సహజ ఖనిజాలు ఒంట్లో వేడిని తగ్గిస్తాయి. మట్టికుండలోని నీళ్లు తాగడం వల్ల వడదెబ్బ బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. జలుబు, దగ్గు, శ్వాసకోస, ఆస్తమా వ్యాధులతో బాధపడే వారు ఫ్రిజ్లో నీటి కంటే కుండలో నీరు తాగితే ఆరోగ్యానికి శ్రేయస్కరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -మార్టూరు రూరల్

జాతీయ రహదారిపై వేరు వేరు చోట్ల జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగని వైద్యం కోసం చిలకలూరిపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు నాయక్ తెలిపిన వివరాలు ప్రకారం మార్టూరు సమీపంలోని నాగరాజుపల్లి గ్రామానికి చెందిన వడ్లమూడి కాలేషా తన పల్సర్ బైకుపై చిలకలూరిపేట వెళుతుండగా రాజుపాలెం వద్ద యలవర్తి కోల్డ్ స్టోరేజ్ సమీపంలో జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం వెనుక నుండి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయానికి అటుగా వెళుతున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు ప్రమాదాన్ని గుర్తించి తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుని 108 వాహనం ద్వారా చిలకలూరిపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మరొక ప్రమాదంలో జై పంగులూరు మండలం రాంకూరు గ్రామానికి చెందిన కామేపల్లి జయకృష్ణ కోనంకి నుండి మార్టూరు వైపు స్కూటీపై వెళుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి స్కూటీ అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



వైద్యశాలకు తరలిస్తున్న దృశ్యం

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- అరెస్టయిన వారిలో ఎర్రచందనం స్మగ్లర్లు
- రూ.85 లక్షల చోరీ సొత్తు స్వాధీనం
- పోలీసులకు ఎస్‌పి దామోదర్ అభినందనలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పగటి పూట ఇళ్ళను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న పేరు మోసిన ఎర్రచందనం స్మగ్లర్లు, దొంగల ముఠాను అరెస్ట్ ప్రకాశం జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు 85 లక్షల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఎస్‌పి ఏఆర్ దామోదర్ తెలియజేశారు. ఎస్‌పి మాట్లాడుతూ గత నెల 14వ తేదీన పొదిలి టౌన్‌లోని బీరం నాసర్ రెడ్డి ఇంటిలో గుర్తు తెలియని దొంగలు సుమారు 27 సవర్ల బంగారం, సుమారు 2 కేజీల వెండి ఆభరణాలను దొంగలించారన్నారు. అప్రమత్తమైన పొదిలి సిఐ సిబ్బందిని వివిధ టీమ్‌లుగా ఏర్పాటు చేసి, మొదటగా పొదిలి టౌన్‌లో ఏర్పాటు చేయబడిన సిసి కెమెరాల ద్వారా ముద్దాయిలు ఏ మార్గం వైపు వెళ్ళినది, నేరం చేయుటకు ఒక తెల్లటి మారుతి సుజుకి స్విఫ్ట్ డిజైర్ కార్ అనుమానితంగా ఉండటాన్ని గుర్తించారన్నారు. ముద్దాయిలు మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రాంతాల వారు అయి ఉండొచ్చని నిర్ధాంచుకున్నారన్నారు. గత నెల 17న మధ్యాహ్నం కావలి ప్రాంతంలో దొంగతనం చేసి పారిపోతున్నట్లు సమాచారం తెలుసుకుని ఆ వాహనాన్ని గుర్తించి వెంబడిస్తుండగా ముద్దాయిలు పోలీసులను చంపి తప్పించుకోవాలని ఉద్దేశ్యంతో వారి కారుతో పోలీసు జీపును ఢీకొట్టి చోరి సొత్తుతో పారిపోయారన్నారు. ఈ విషయాన్ని పొదిలి సిఐ ప్రొద్దుటూరు సిఐకి సమాచారం ఇచ్చి వారి కదలికలపై నిఘా పెట్టారన్నారు. విశాఖపట్నం నుంచి దర్శి మీదుగా పొదిలి వస్తున్నట్లు గుర్తించారన్నారు. పొదిలి గ్రామంలో దర్శి రోడ్‌లోని ఎస్‌వికెపి కాలేజీ వద్ద వాహన తనిఖీ చేస్తుండగా ముద్దాయిల కారును గుర్తించారు. సిఐ తన సిబ్బంది ద్వారా ఆపడానికి ప్రయత్నించగా ఆపకుండా పారిపోయే క్రమంలో చెట్టును ఢీకొట్టుకొని ఉండగా సిఐ కారులోని ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి తెలియజేశారు.


పొదిలి సిఐ వెంకటేశ్వర్లును అభినందిస్తున్న ఎస్పీ దామోదర్

ముద్దాయిలు వీరే...

ఈ కేసులో వైఎస్‌ఆర్ కడప జిల్లాకు చెందిన ముగ్గురు ముద్దాయిలను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో చింపర్తి ఫక్రుద్దీన్ (35) ఖాదర్‌వలి గ్రామం వైఎస్‌ఆర్ కడప జిల్లా, చింపర్తి సింపతి మహబూబ్ పీరా (25) ఖాదర్‌వలి గ్రామం, వైఎస్‌ఆర్ కడప జిల్లా, గాండ్లు లతీఫ్ భాషా (24) ప్రొద్దుటూర్ టౌన్, వైఎస్‌ఆర్ కడప జిల్లా అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిపై ప్రకాశం జిల్లాలో 3 కేసులు, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో 9 కేసులు, వైఎస్‌ఆర్ కడప జిల్లాలో 3 కేసులు, అనంతపురంలో 1 కేసు, అన్నమయ్య జిల్లాలో 1 కేసు, వీటితో పాటు గతంలో నంద్యాలలో7, కడపలో 5, బేతంచర్లలో 2, తిరుపతి సిసిఎస్‌లో 2, చిన్న చౌక్‌లో 2, కోడూరులో 1, మైదుకూరులో 1, ఎర్రగుంట్లలో 1 మొత్తం 21 కేసులు నమోదయ్యాయి. ముద్దాయిలపై గతంలో ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులు 74 నమోదు అయ్యాయి.

85 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

ఈ కేసుల ముద్దాయిల నుంచి సుమారు రూ 85 లక్షల చోరీ సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 9.24 కిలోల బంగారు ఆభరణాల విలువ రూ 81 లక్షలు, 3.800 కిలోల వెండి వస్తువుల విలువ రూ.4,20,000లు, 6 కిలోల గంజాయి, తెలుపు రంగు కారును స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులకు ఎస్‌పి అభినందనలు

ఈ కేసులో ఉత్తమ ప్రతిభ కనపరిచిన దర్శి డిఎస్‌పి బి. లక్ష్మినారాయణ, కడప జిల్లా మైదుకూరు డిఎస్‌పి రాజేంద్ర ప్రసాద్, పొదిలి సిఐ టి. వెంకటేశ్వర్లు, మైదుకూరు రూరల్ శివశంకర్, పొదిలి ఎస్‌ఐ వి. వేమన, కొనకనమిట్ల ఎస్‌ఐ టి. రాజ్ కుమార్‌ను, ప్రొద్దుటూరు రూరల్ ఎస్సై అరుణరెడ్డి, పొదిలి, కొనకనమిట్ల పోలీస్ స్టేషన్ సిబ్బంది మురళీ కష్ణ, షకీర్, కోటేశ్వరరావు, గురు ప్రసన్న, ఎం.అంకయ్యలను ఎస్పీ అభినందలు తెలియజేశారు. ప్రశంస పత్రాలు, రివార్డ్సును ప్రకటించారు.

ప్రాణ నష్టం జరగకుండా చూడండి

- పిడుగుపాటుపై అవగాహన కల్పించాలి
- అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్


కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రకృతి విపత్తుల సమయంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా చూడాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ దిశగా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం, గాలి దుమారం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకష్ణతో కలిసి మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సోమవారం అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి విపత్తుల సమయంలో గ్రామస్థాయి సిబ్బంది అందరూ క్షేత్రస్థాయిలోనే ఉండాలని స్పష్టం చేశారు. పిడుగుపాటుకు దారితీసే పరిస్థితులు, ఆయా సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డప్పు చాటింపుతో పాటు ప్రసార మధ్యమాల ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వాతావరణ మార్పులపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎప్పటికప్పుడు వస్తున్న హెచ్చరికలను గమనించి ఆయా విషయాలను ప్రజలకు చేరవేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఒ బి.చిన ఓబులేసు, జిల్లా కేంద్రం నుంచి అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

త్వరలో టిడ్కో ఇళ్లు పంపిణీ

- అర్హులకు 2 సెంట్ల స్థలం అందజేత
- గ్రీన్ బెల్ట్ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

పెండింగ్‌లోని టిడ్కో ఇళ్ళను త్వరలోనే లబ్ధిదారులకు అందజేస్తామని, ఇటీవల టిడ్కో కార్పొరేషన్ అధికారులు అంచనాలు వేసుకొని వెళ్లారని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ తెలిపారు. నగరంలో అర్హులైన పేదలకు గతంలో చెప్పిన విధంగా 2 సెంట్ల స్థలం ఇస్తామని, రేషన్ కార్డులు, పింఛన్ల కోసం ఇంటింటి సర్వే చేపట్టామని పేర్కొన్నారు. ఒంగోలు నగరం 15వ డివిజన్ రాంనగర్ 1 నుంచి 10 లైన్ల వరకు ఎన్‌క్యాప్ నిధులు రూ.60 లక్షలతో నిర్మించనున్న గ్రీన్ బెల్ట్ అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ ఒంగోలు నగర ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అదించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ఒంగోలు నగరాన్ని సుందరీకరణ దిశగా చర్యలు తీసుకుంటున్నామని, అన్ని ప్రాంతాలలో పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అపార్ట్‌మెంట్లలో పెద్దవయస్సు వారు సాయంత్రం వేళలలో సేద తీరేందుకు, వాకింగ్, మిత్రులతో చర్చించుకునేందుకు వీలుగా పార్కులను అభివృద్ధి చేశామన్నారు. వచ్చే 6 నెలల కాలంలో ఒంగోలు నగరం సుందరీకరణ, డివైడర్లకు రంగులు, పచ్చదనం పెంపుదల చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధంచేశామన్నారు. అమృత్ 2లో రూ.410 కోట్లతో పాత పైపులైన్ల మార్చి కొత్తవి ఏర్పాటు చేస్తున్నామన్నారు. తద్వారా మరో 30-40 ఏళ్ళకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటాయన్నారు. రామతీర్థం నుంచి వచ్చే నీరు పచ్చగా ఉంటుందని, ఈ విషయమై ఇరిగేషన్, ఎన్ఎస్‌పి అధికారులతో చర్చించి స్వచ్ఛమైన నీటిని ప్రజలందరికి అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవిలో ప్రజలకు అవసరమైతే ట్యాంకర్ల ద్వారా మంచినీటిని ప్రజలకు అందిస్తామన్నారు. ఒంగోలు నగరంలోని అన్ని ప్రాంతాలకు ఉదయం 4 నుంచి రాత్రి 10 గంటల లోపు నీటి సరఫరా పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధ ంచేస్తున్నామన్నారు.

ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఎమ్మెల్యే దామచర్ల సహకారంతో ఒంగోలు నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. 15వ డివిజన్‌లో గ్రీన్ బెల్ట్ అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేస్తామని, ప్లాంటేషన్ పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. ఒంగోలు నగర ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పనకు ఎమ్మెల్యే దామచర్ల ప్రత్యేక నిధులు తీసుకొచ్చారని, ఒడా నుంచి నిధులు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, 15, 9వ డివిజన్ కార్పొరేటర్లు చింతపల్లి గోపీచంద్, బెంగళూరు నరసయ్య, టిడిపి నాయకులు బండారు మదన్, వెంకటేశ్వర రెడ్డి, బి.ఆదినారాయణ, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను వెంటనే పరిష్కరించాలి

రెవెన్యూ ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మంత్రి స్వామి

ప్రజాశక్తి-పొన్నలూరు

గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం సమీపంలో సోమవారం తహశీల్దార్ వి.పుల్లారావు అధ్యక్షతన ప్రత్యేక ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ సమస్యలపై మొత్తం 222 అర్జీలను పరిశీలించి వెంటనే కొన్నింటిని పరిష్కరించారు. మంత్రి బాల వీరాంజనేయస్వామి ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అర్జీలను స్వీకరించారు. ఆయా శాఖల అధికారులకు వీటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, అభివద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారని చెప్పారు. రాష్ట్రానికి వస్తున్న పరిశ్రమలు, పెట్టుబడులు చూసి ఓర్వలేక వైసీపీ విషం చిమ్ముతోందన్నారు. అమరావతిపై తప్పుడు ప్రచారం చేస్తే చరిత్రహీనులుగా మిగిలిపోతారని అన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. వెంటనే నిధులు ఏర్పాటు చేసి.. ఆశ్రమ పాఠశాల త్వరగా పూర్తిచేస్తామని, రాబోయే విద్యా సంవత్సరానికి తరగతులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, ఎంపీడీవో డాక్టర్ పి సుజాత, మండల టిడిపి అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, నాయకులు మండవ ప్రసాద్, కర్ణ కోటిరెడ్డి, గుమ్మళ్ళ వెంకట్రావు, మండవ మురళీమోహన్, పల్లపోతు రమేష్ బాబు, అనుమోలు సుధాకర్, అనుమోలు రాజా రమేష్, పల్లపోతు వెంకట్రావు, మండల టిడిపి ఉపాధ్యక్షుడు తానికొండ మహేంద్ర, మన్యం రమణయ్య, మధుబాబు, సర్పంచ్ షేక్ చిన్న మస్తాన్, నాగిరెడ్డి బాలకష్ణారెడ్డి, పిల్లి వెంకట నారాయణరెడ్డి, ఆయా శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, మండలంలోని ప్రజలు పాల్గొన్నారు.


అర్జీదారుల సమస్యలు వింటున్న మంత్రి స్వామి

అర్జీదారులను తిప్పుకోవద్దు..

అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజాసమస్యల పరిష్కారం కోసం అర్జీదారులను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటే ఊరుకోబోనని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను హెచ్చరించారు. వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' లో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దష్టి సారించాలని ఆదేశించారు.

'మీ కోసం' కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.


ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా


సమస్యలు తెలుసుకుంటున్న డిటిసి సుశీల

ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తుండటంతో ప్రతి ఒక్క అర్జీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. వాటికి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితిల్లోనూ అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని ఆమె ఆదేశించారు. అధికారులు ప్రతిరోజూ లాగిన్ అయ్యి.. ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలన్నారు. సాంకేతిక సమస్యల వల్ల క్షేత్రస్థాయిలో పరిష్కరించలేని అర్జీలు వస్తే ఆ విషయాన్ని ప్రజలకు అప్పుడే స్పష్టం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, పార్ధసారథి, వరకుమార్, విజయజ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.